అడుగు ముందుకు..

● రూ.కోట్లు ఖర్చు చేసినా ఫలితం సున్నా..

ఆంధ్రజ్యోతి విజిట్

పదడుగులు వెనక్కు...

● ఎక్కడికక్కడే అగిన పనులు ● ఇదీ జిల్లాలో నాడు-నేడు పనుల తీరు

వైసీపీ హయాంలో ఎంతో ఆర్భాటంగా మొదలైన నాడు-నేడు పనులు ప్రస్తుతం జిల్లాలో ఒక అడుగు ముందుకు.. పదడుగులు వెనక్కు.. అనే రీతిలో కొనసాగుతున్నాయి. గత ఐదేళ్లలో కోట్ల రూపాయలు వ్యయం చేసినా ఫలితం మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. నిధులు మంజూరైనా విడుదల కాకపోవడంతో పాఠశాలల్లో పనులు ఎక్కడిక క్కడే ఆగిపోయాయి. దీంతో పలు పాఠశాలల్లో సౌకర్యాలు లేక.. ఇరుకు గదుల్లో... పాత భవనాల్లోనే విద్యార్థులు చదువుకో వాల్సి వస్తోంది. పలుచోట్ల భవనాలు అసంపూర్తిగా నిలిచిపో యాయి. కొన్నిచోట్ల స్కూల్ అకౌంటులో డబ్బు ఉన్నప్పటికీ పనులు చేయడం లేదు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నిర్వహించిన విజిట్‌లో నాడు-నేడు పనుల్లోని డొల్లతనం బయట పడింది.



పునాదికే పరిమితమైన కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల భవనం



అసంపూర్తిగా ఉన్న సంబేపల్లె మండలం దేవపట్ల హైస్కూల్ అదనపు గదులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన నాడు-నేడు పనులు 80 శాతం అసంపూర్తిగా ఉన్నాయి. రాజంపేట మండలం లోని 46 పాఠశాలలకు గానూ రూ.47 కోట్లు మంజూరయ్యాయి. అయితే నిధులు విడుదల కాకపోవడంతో 46 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రాజంపేట పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాలలో అన్ని గదులు పెండింగ్‌లోనే ఉన్నాయి. 1.20 కోట్లు మంజూరైనా విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రెండు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. సుండుపల్లె మండలంలో 22 పాఠశాలలకు రూ.6.59 కోట్లు మంజూరైనా అవి విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా ఉన్నాయి. జి.రెడ్డివారిపల్లె ఉన్నత పాఠశాలలో పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో సిమెంట్ బస్తాలన్నీ గడ్డకట్టిపోయాయి.

కోడూరు మండలంలో నాడు-నేడు కింద 42 పాఠశాలల్లో పనులు చేపట్టగా 50 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పుల్లంపేట మండలం కేజీబీవీ పాఠశాలలో సిమెంటు లేక తరగతి గదుల ని ర్మాణాలు ఆగిపోయాయి. ఓబులవారిపల్లె జూనియర్ కళాశాలలో పనులు ఆగిపోయి ఉన్నాయి.



మదనపల్లె వివేకానంద మున్సిపల్ హైస్కూల్లో చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నిధులు ఖర్చయ్యాయి.. పనులు పూర్తి కాలేదు

మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఆయా పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌కు నిధులు మంజూరైనా 80 శాతం ఖర్చుపెట్టి మిగిలిన పనులు వదిలేశారు. దీంతో ఇప్పటికీ చెట్ల కింద, వరండాల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ములకలచెరువు మండలం సోంపల్లెలో ప్రభుత్వ పాఠశాల పైకప్పు పెచ్చులూడి ఉరుస్తోంది. రామసముద్రం మండలంలో రెండో విడత నాడు-నేడు పనులు 75 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కురబలకోట మండలంలో రూ.12.29 కోట్లకు గాను రూ.6.17 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, గోడలకు పెయింటింగ్, వంటగదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. పీటీఎం మండలంలో రూ.13.66 కోట్ల నిధులు మంజూరు కాగా అన్ని పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. బి.కొత్తకోట మండలంలో రెండు విడతల్లో రూ.9.61 కోట్ల నిధులకు గాను 70 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. నిమ్మనపల్లె, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లోనూ అదే పరిస్థితి ఉంది.

సంబేపల్లె మండలంలో నాడు-నేడు కింద 40 పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో ఐదు ఉన్నత పాఠశాలలు, 17 అంగన్‌వాడీ కేంద్రాలు, 18 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఎక్కడా పనులు పూర్తి కాలేదు. దేవపట్ల ఉన్నత పాఠశాలలో ఆరు భవనాలు ఒక్కొక్కటి రూ.12 లక్షలతో నిర్మించి మధ్యలోనే వదిలేశారు. పాఠశాలలో ప్రస్తుతం సిమెంటు, కిటికీలు, తలుపుల సామాగ్రి, గ్రానైట్ బండలు నిరుపయోగంగా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

రాయచోటి మండల పరిధిలో నాడు-నేడు పథకం కింద 39 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం ప్రహరీగోడలు ఇతరత్రా అవసరాల నిమిత్తం రూ.12.49 కోట్లు మంజూరయ్యాయి. ఇంకా చాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురంలో వీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భవనాలు నిర్మాణం పూర్తయినట్లు కనిపిస్తున్నా సౌకర్యాల కల్పన పూర్తికాక అదే భవనాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. కలికిరి మండలంలో 29 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.8 కోట్లతో పనులు ప్రారంభించారు. ఇప్పటికి ఏ పాఠశాలలోనూ 50 శాతం మించి పనులు పూర్తి కాలేదు. గుర్రంకొండ మండలం కంద్రిగ పాఠశాల చుట్టూ ఉన్న పాత ప్రహరీని తొలగించారు. కొత్త ప్రహరీ నిర్మాణం చేపట్టలేదు. ఈ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండడంతో అప్పట్లో తాత్కాలికంగా ప్రహరీ లేని చోట రాతి కూసాలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనం పనులు నేటికీ పునాదులకే పరిమితమయ్యాయి. పలుచోట్ల కొంత నిధులు ఖర్చు చేసి తర్వాత పనులు నిలిపేశారు.



సుండుపల్లె మండలం జి.రెడ్డివారిపల్లె ఉన్నత పాఠశాలలో గడ్డ కట్టిన సిమెంటు బస్తాలు

వైభవంగా నరసింహస్వామి ధ్వజారోహణం

● మహిళలకు కుడి ప్రసాదాల పంపిణీ

● హంస వాహనంపై స్వామివారు



ధ్వజారోహణం చేస్తున్న వేద పండితులు

గుర్రంకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి ధ్వజారోహణాన్ని టీటీడీ వేద పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా గురువారం ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, తోమాలసేవ, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనాన్ని అర్చకులు చేశారు. ఉత్సవ మూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మీనలగ్నంలో గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిరోహింపజేసి పది రోజులు పాటు బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరగాలంటూ పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామి వారు హంస వాహనంపై గ్రామ పురవీధుల్లో విహరించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఆలయాధికారి కృష్ణమూర్తి, టీటీడీ అర్చకులు గోపాల్‌భట్టార్, కృష్ణప్రసాద్, కృష్ణరాజ్, అనిల్, గోకుల్, నరసింహ, ధనుష్, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కుడి ప్రసాదాల కోసం ఎగబడ్డ మహిళలు....

స్వామివారి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ధ్వజారోహణం రోజున కుడి ప్రసాదాలను (సంతాన ప్రసాదం) మహిళలకు పంపిణీ చేస్తారు. ఈ ప్రసాదాలను సంతానం లేని దంపతులు తింటే వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో కుడి ప్రసాదాల కోసం మహిళలు ఎగబడ్డారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారు ముత్యపు పందిరి వాహనం, రాత్రికి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



మహిళలకు కుడి ప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

పెన్షన్, గ్రాట్యుటీ నిలుపుదల

● ఐసీడీఎస్ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు
● 10 శాతం కమీషన్లు, లైంగిక వేధింపుల ఆరోపణలు
● కోడూరు, లక్కిరెడ్డిపల్లెలో పనిచేసిన బాలగుర్రప్ప

కలికిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి వివిధ రకాల బిల్లులకు 10 శాతం కమీషన్లకు కక్కుర్తిపడటం, వారిని లైంగికంగా వేధించడం వంటి పలు ఆరోపణలు రుజువు కావడంతో రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఎన్.బాలగుర్రప్ప పెన్షన్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. ప్రస్తుతం ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు రావలసిన పెన్షన్‌తో పాటు, గ్రాట్యుటీ సొమ్ము చెల్లింపును కూడా నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 14 ఏళ్లుగా సాగిన ఆరోపణలు, విచారణలు, సంజాయిషీల అనంతరం తాజాగా ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుని బుధవారం ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2011లో బాలగుర్రప్ప రైల్వేకోడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. ఆ ప్రాజెక్టు పరిధిలో పనిచేసే అంగన్‌వాడీ కార్యకర్తల టీఏ బిల్లులు, ఇతరత్రా బిల్లులకు 10 శాతం వంతున కమీషన్ చెల్లిస్తేనే బిల్లులు మంజూరయ్యేవి. దీనికి తోడు అంగన్‌వాడీ కార్యకర్తలను లైంగిక వేధించేవారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తగిన ఆధారాలతో ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. 2011 ఆగస్టు 8న దీనిపైన కర్నూలు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ రీజనల్ డైరెక్టర్ బాలగుర్రప్పకు నోటీసులు జారీ చేశారు. ఆ తరువాత ఆయనను లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తుండగానే ఇవే ఆరోపణలపై 2015 జూన్ 24న మళ్లీ చార్జి నోటీసులు జారీ చేశారు. దీనిపై కడప మహిళా శిశు సంక్షేమ అధికారి విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. బాలగుర్రప్ప పైన వచ్చిన ఆరోపణలన్నీ విచారణ నివేదికల ఆధారంగా పూర్తిగా రుజువైనట్లు ప్రభుత్వం తేల్చింది. దీంతో ఆయన నెలవారీ పెన్షన్, గ్రాట్యుటీ చెల్లింపునూ నిలుపుదల చేస్తూ రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

నీటిశుద్ధి కేంద్రాల నిర్వహణ పంచాయతీలకు అప్పగించాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గతంలో వివిధ నిధుల కింద మంజూరు చేసి నెలకొల్పిన నీటిశుద్ధి కేంద్రాల (ఆర్వో ప్లాంట్లు) నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శాసనసభ దృష్టికి తెచ్చారు. గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి మినరల్ గ్రాంట్స్ పేరుతోనూ, ఎంపీ నిధులతోనూ పీలేరు నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఒక్క పీలేరు మండలంలోనే 22 ప్లాంట్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఈ విధమైన ప్లాంట్‌లు నెలకొల్పారని, అయితే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు వరకే బాధ్యత తీసుకున్నారని ప్రస్తుతం వీటి నిర్వహణ అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. ప్లాంట్ మరమ్మతులు, ఫిల్టర్లు మార్చడం, నీటిని వదిలే ఉద్యోగికి జీతాలు చెల్లించడానికి ఎక్కడా నిధులు లేవన్నారు. ఇప్పటికే వేసవి సమీపించి తాగునీటి అవశ్యకత పెరిగిందన్నారు. గతంలో నియమించిన ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడంతో శుద్ధి కేంద్రాలు నిరుపయోగంగా తయారయ్యాయని చెప్పారు. స్థానిక పంచాయతీలను సంప్రదిస్తే వాటిని నిర్వహించడానికి తమకెలాంటి అనుమతులు లేవని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారని, ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఆర్వో ప్లాంట్‌ల నిర్వహణ బాధ్యతను స్థానిక పంచాయతీలకు అప్పగిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సభలో లేకపోవడంతో ఆయన తరఫున మంత్రి నాదెళ్ల మనోహర్ సమాధానమిస్తూ సమస్యను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాగా పీలేరు నియోజకవర్గంలో ఆర్వో ప్లాంట్‌ల నిర్వహణ అటకెక్కడంపై 'ఆశయం ఘనం.. అమలు అస్తవ్యస్తం' శీర్షికతో ఫిబ్రవరి 9న ఆంధ్రజ్యోతి పీలేరు నుంచి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఇవే సమస్యలను కిశోర్‌కుమార్‌రెడ్డి కూడా గురువారం శాసనసభ దృష్టికి తెచ్చారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి

● ప్రొబెషనరీ మహిళా ఎస్‌ఐలతో ఎస్పీ



ప్రొబెషనరీ మహిళా ఎస్‌ఐలతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతపురం, అన్నమయ్య జిల్లాలకు కేటాయించిన నలుగురు మహిళా ప్రొబెషనరీ ఎస్‌ఐలు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎస్పీ అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీతో బాధితులకు న్యాయం చేయడంతో పాటు నిందితులకు శిక్ష పడేలా పనిచేయాలని, పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఎఫ్‌ఐఆర్, దర్యాప్తునకు సంబంధించిన రికార్డులను రాయడం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఎక్కడ ఏ విధమైన అనుమానం వచ్చినా వెంటనే సీనియర్ అధికారులను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. ఎస్పీని కలిసిన వారిలో ప్రొబెషనరీ మహిళా ఎస్‌ఐలు, దొంతుల తేజస్విని, బానోతు శ్రీప్రియ, చిత్తూరు సుస్మిత, పోకల హారిక ఉన్నారు.

కోదండరామాలయంలో మహాసంప్రోక్షణ



వేదపండితులు నిర్వహిస్తున్న మహా సంప్రోక్షణ

రాజంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామాలయంలో మహా సంప్రోక్షణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంప్రోక్షణలో రెండోరోజు గురువారం వేద పండితులు ఉదయం నుంచే భగవత్ పుణ్యాహవచనం, అగ్నిమదనం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, మహా కుంభ కార్యక్రమాలు నిర్వహించారు. ఉప కుంభ, పరివార కుంభారాధనలు, హోమాలు, మన్యోహనశాంతి హోమం, పూర్ణాహితు అర్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

త్రిపుల్‌ఐటీ ఆడిటోరియం పూర్తి చేయండి

మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఆగిపోయిన ఆడిటోరియం పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ రూ.40 కోట్లతో ఆడిటోరియం నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే వదిలేశారని అన్నారు. సుమారు రూ.10 కోట్ల మేర పనులు జరిగాయన్నారు. విద్యార్థులకు ఆడిటోరియం ఎంతో అవసరమని దీనిని పూర్తిచేసేందుకు మంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


'పోసాని' పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

కడప, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి ఓబులవారిపల్లెలో పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు ఆయనను అరెస్టు చేశారు. బెయిలు కోసం పోసాని తరఫు లాయర్లు, కస్టడీ కోసం ఓబులవారిపల్లె పోలీసులు కడపలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండింటిపై విచారణను కడప మొబైల్ కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

సెంటు భూమి కూడా వదలం : కలెక్టర్ 6

నిమ్మ ధరలు పైపైకి... 6
నాటుబాంబు పేలి ఆవుకు గాయాలు

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
రాయచోటి	6.28	5.07
మదనపల్లె	6.30	5.13
రాజంపేట	6.27	5.15
పీలేరు	6.28	5.06

ఎండ.. చలి.. మంచు...

● రైల్వేకోడూరులో భిన్న వాతావరణం



ఎండలో గొడుకు పట్టుకుని వెళుతున్న వృద్ధుడు



రైల్వేకోడూరులో మంచు దుప్పటి

పగలు ఎండ, రాత్రి చలి, ఉదయం మంచు ఇలా భిన్న వాతావరణంలో రైల్వేకోడూరు ఉంది. మరో కోనసీమలా పిలిచే రైల్వేకోడూరులో పగలు పగలంతా ఎండ మంట పుట్టిస్తుండగా.. రాత్రి చలి.. ఉదయం విపరీతంగా మంచు పడుతోంది. పగలు ఎండ వేడికి తట్టుకోలేక కొందరు వృద్ధులు గొడుగులు పట్టుకుని వెళుతున్నారు. రాత్రి వేళలో చలికి వణుకుతున్నారు. ఒకవైపు వేడి ఉన్నా సాయంత్రానికి చల్లగా వాతావరణం మారుతోంది.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)



మంచులో వాకింగ్ చేస్తున్న కోడూరు యువకులు



దిగుబడి ఉన్నపుడు ధర ఉండకపోవడం.. ధర ఉన్నపుడు దిగుబడులు లేకపోవడం సాధారణంగా రైతులు ఎదుర్కొనే సమస్య. అయితే, ఈ ఏడాది రైల్వే కోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా నిమ్మ దిగుబడులు అధికంగా ఉండగా, అదే సమయంలో ధర కూడా ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నిమ్మ ధరలు పైపైకి..

- ఈ ఏడాది ఆశాజనకంగా దిగుబడులు
- 50 కిలోల బస్తా రూ. 2000 దాకా..
- ఇంకా పెరిగే అవకాశం

రైల్వేకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగులో రైల్వేకోడూరు నియోజకవర్గం దక్షిణ భారతదేశంలోనే పేరు పొందింది. గతంలో ఇక్కడి నుంచి కేరళలోని ఎర్నాకుళం, తిరుచూరు, మహారాష్ట్రలోని ముంబై, కర్ణాటక రాష్ట్రంలోని హాస్పేట్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి నిమ్మకాయలు ఎగుమతి అయ్యేవి. చిన్నచిన్న వ్యాపారులు తిరుపతి, రాజంపేట, కడప, అనంతపురం, చిత్తూరు తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారు. 2000-03 మధ్య కాలంలో ఈ ప్రాంతంలో తీవ్రమైన కరువు కారణంగా నిమ్మతోటలు ఎండిపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. 2015-17 మధ్యకాలంలో దిగుబడి అధికంగా వచ్చినా ధర లేకపోవడంతో పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది అదును తప్పి కాపు రావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. అప్పట్లో ప్రతిరోజు 200 బస్తాల దాకా మాత్రమే ఎగుమతి అయ్యాయి. ప్రస్తుతం 400 బస్తాలు ఒక్క ఎర్నాకుళంకే వెళుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది కాపు బాగా ఉండగా, అందుకు తగినట్లు డిమాండు కూడా ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం మొదటి రకం నిమ్మ కాయలు 50 కిలోల బస్తా రూ.1500 నుంచి రూ.2000 వరకు ధర పలుకుతోంది. మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర బాగుంది



ధరలు బాగా ఉన్న సమయంలో దిగుబడి లేక పోవడం, దిగుబడి ఉన్న సమయంలో ధర లేక ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం నిమ్మ కాయలకు డిమాండు బాగా ఉంది. దిగుబడి కూడా బాగానే ఉంది.

- మలిశెట్టి మాధవయ్య, రైతు, వెంకటరాజుపల్లె

పది రూపాయలకు రెండు కాయలు

పట్టణంలో రెండు నిమ్మకాయలను రూ. 10కి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో డిమాండు పెరిగింది. తోటల వద్దే పచ్చికాయలు కూడా అమ్మేస్తుండడంతో పండ్లు దొరకడం కష్టంగా మారిందని వినియోగదారులు అంటున్నారు.



నిమ్మకాయలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సెంటు భూమి కూడా వదలం..

- నల్లారి చొరవతోనే ఆక్రమణలపై విచారణ
- ఆక్రమణదారులపై కఠిన చర్యలు
- పీలేరులో కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమీక్ష సమావేశంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

పీలేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పోరాటాల ఫలితంగానే పునఃప్రారంభమైందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. 'సర్కారీ భూములు స్వాహా, నాడు చెరపట్టిన వైసీపీ నేతలు' అన్న శీర్షికతో పీలేరు మండలంలో భూఆక్రమణలపై ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ విషయంపై గురువారం ఆయన పీలేరులో మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్న ఆక్రమణల జాబితాలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో పేర్కొన్న పలు సర్వే నెంబర్లు ఉండడంతో ఇప్పటికే కొన్నింటిని తొలగించామని, మరికొన్ని సర్వే నెంబర్లపై విచారణకు స్థానిక అధికారులను ఆదేశించామన్నారు. ఆక్రమణదారుల చెరలో ఉన్న చివరి సెంటు ప్రభుత్వ భూమిని విడిపించే వరకు విశ్రమించబోమన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి గతంలో చేసిన ఫిర్యాదు, మదనపల్లె పూర్వ సబ్-కలెక్టర్ జాహ్నవి నివేదిక మేరకు పీలేరు మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో 600 ఎకరాల అవకతవకలపై విచారణకు 10 బృందాలను నియమించామని తెలిపారు. గడిచిన ఐదురోజుల్లో సుమారు 338 ఎకరాల మేరకు విచారణ పూర్తి చేశాయన్నారు. మరో నాలుగు రోజుల్లో విచారణ పూర్తి చేస్తాయని, ఆ తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విచారణ పురోగతిపై సమీక్షించారు.

నేనూ భూ ఆక్రమణల బాధితుడినే...

సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన తాను కూడాఆక్రమణదారుల బారిన పడి ఇబ్బంది పడిన వాడినేనని కలెక్టర్ తెలిపారు. తన చెల్లి పెళ్లి సందర్భంగా ఎంతో కష్టపడి కూడబెట్టిన రూ.4 లక్షలతో తన తల్లిదండ్రులు ఒక ఇంటి స్థలం కొనుగోలు చేశారన్నారు. అయితే ఆ స్థలాన్ని తమకు అమ్మిన రియల్టర్ ఆ స్థలం ఒక సర్వే నెంబరులో ఉంటే మరో సర్వే నెంబరు వేసి రిజిస్టరు చేసి ఇచ్చాడన్నారు. నాలుగేళ్ల తరువాత అతని మోసం బయటపడిందన్నారు. తాము గట్టిగా ఎదిరిస్తే 50 శాతం సొమ్ము వాపసు చేశాడన్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు డీకేటీ, ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారని వాపోయారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాలను స్పష్టంగా చూపించే యాప్‌గానీ, వెబ్‌సైట్ గానీ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

పీలేరు అధికారుల పనితీరు మెరుగుపడింది...

పీలేరు మండలంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారుల పనితీరు రెండు నెలల వ్యవధిలో గణనీయంగా పెరిగిందన్నారు. ఆర్‌టీజీఎస్ ద్వారా మండలంలో 550 అర్జీలు అందగా వాటిలో 500 అర్జీలు పరిష్కరించామన్నారు. రీసర్వేలో అందిన దరఖాస్తుల్లోనూ కేవలం 80 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తహసీల్దారు భీమేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూలు వ్యాను ఢీకొని ఒకరు మృతి



సంఘటనా స్థలంలో బాలయ్య మృతదేహం

పుల్లంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్కూలువ్యాను బైకును ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు ఓబులవారిపల్లె మండలం పి.కమ్మపల్లె హరిజనవాడకు చెందిన బత్తల బాలయ్య(64) మాలేపాటి రమణయ్య బైకుపై వస్తుండగా రాజంపేటలోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన స్కూలు వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు గాయపడగా హుటాహుటిన 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలయ్యను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

అతిగా మద్యం సేవించి..

పెద్దతిప్పసముద్రం మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు .. మల్లెల పంచాయతీ గొందిపల్లెకు చెందిన చౌడిరెడ్డి (55) రైతు. బుధవారం అధిక మోతాదులో మద్యం సేవించి ఇంట్లో నిద్రపోయాడు. గురువారం ఉదయం ఎంతసేపటికి నిద్ర లేవక పోవడంతో భార్య వెళ్లి పరిశీలించగా, మృతిచెందినట్లు తేలింది. మృతునికి భార్య సరోజమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

తండ్రిపై కొడుకు దాడి



చికిత్స పొందుతున్న ఖాదర్‌హుస్సేన్

సిద్ధవటం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకే తండ్రిపై బండరాయితో దాడి చేసిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన ఖాదర్ హుస్సేన్‌కు అతని కుమారుడు బాబాఫకృద్దీన్ మధ్య తమ ఇంటిని అద్దెకు ఇచ్చే విషయంలో బుధవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహించిన కొడుకు బండ రాయితో దాడి చేయగా, తీవ్రంగా గాయపడిన తండ్రి కుప్పకూలి పో యాడు. స్థానికులు అతనిని ఒంటిమిట్టలోని ప్రభుత్వ ఆస్పత్రికి తర లించగా, ప్రాథమిక చికిత్స అనంతరం రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆస్తి కోసమే తన కుమారుడు దాడి చేశాడని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు..

నిమ్మనపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు సోమల మండలం తుమ్మినాయునిపల్లి పంచాయతీ కురవపల్లికి చెందిన శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై నిమ్మనపల్లి రోడ్డు మీదుగా మదనపల్లి వైపు వెళుతుండగా ఎదరుగా వస్తున్న మారుతి కారు ఢీకొని వెళ్లిపోయింది. దీంతో శ్రీనివాసులు కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి బావమరిది మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

ప్రధాన రహదారిపై నల్లటి రసాయనం

- ఇబ్బంది పడిన ప్రయాణికులు
- స్పందించిన అధికారులు



రహదారిపై పడిన పౌడర్‌ను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న తపాలా కార్యాలయం సమీపంలో నల్లటి పౌడర్‌తో కూడిన బ్యాగ్ రోడ్డుకు అండగా పడడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుధవారం అర్ధరాత్రి చెన్నై నుంచి తాడిపత్రికి వెళుతున్న లారీ నుంచి ఈ బ్యాగ్ జారిపడింది. విషయం తెలుసుకున్న లారీ డ్రైవర్ జేసీబీ సాయంతో దానిని తిరిగి లారీలో లోడ్ చేయిస్తుండగా జారిపడి పగిలిపోయింది. దీంతో అందులోని పౌడర్ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. దీంతో లారీ డ్రైవర్ పరారయ్యాడు. గురువారం ఉదయం పంచాయతీ అధికారులు నీళ్లతో రోడ్డును శుభ్రం చేశారు.

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడి మృతి



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఎర్రగుంట్ల, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీపీపీ పాత కోల్ ప్లాం టులో పనిచేస్తున్న కార్మికుడు హఠాత్తుగా మృతి చెందాడు. తాడిపత్రికి చెందిన నాగరాజు(40)గురు వారం సాయంత్రం విధి నిర్వహణలో ఉన్న పళంగా కుప్పకూలడంతో అతనిని ప్లాంటు ఆసు పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం తరలిస్తుండగా మధ్యలో మృతిచెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మృతికి కారణమంటూ మృతుడి భార్య, బంధువులు ధర్నాకు దిగారు. మృతుడి భార్యకు ఉద్యోగంతో పాటు, ఆర్థిక సహాయం కూడా చేసేందుకు అధికారులు ఒప్పుకోవడంతో వారు ధర్నా విరమించారు.

మహిళా సాధికారతకు కృషి చేద్దాం

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో విద్యార్థినులతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలో పోలీసుల ఆధ్వర్యంలో మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మహిళల భద్రత, పోలీసు విధులపై విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించామని, మరింత అవగాహన కోసం ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖతో పాటు ఇతర శాఖల సహకారంతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రధానం చేస్తామని వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థినులకు పోలీసులు ఉపయో గిస్తున్న అత్యాధునిక ఆయుధాలు, బాంబ్ డిస్పోజల్స్ పరికరాలు, సాంకేతికత విజ్ఞానంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్, అదనపు ఎస్పీ చాంబర్‌తో పాటు వివిధ విభాగాల కార్యాలయాలను సందర్శించారు. పోలీసుశాఖపై ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్‌ఐలు, వీజే రామకృష్ణ, పెద్దయ్య, ఏఆర్, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'అనర్హులకే ఇళ్లపట్టాలు'పై విచారణ

- ఎనిమిది మంది సభ్యులతో కమిటీ



సీటీఎం లేఅవుట్‌లో విచారణ చేస్తున్న తహసీల్దార్ ధనంజయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనర్హులకే ఇళ్లపట్టాలు..అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాలతో తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో సీటీఎం-2 గ్రామం సర్వేనెంబర్ 779/2 లేఅవుట్‌లో విచారణ ప్రారంభించారు. నలుగురు వీఆర్‌ఓలు, నలుగురు విలేజ్ సర్వేయర్ల బృందాలు విడివిడిగా ప్రతి ఇంటి స్థలం వద్దకు వెళ్లి లబ్ధిదారుడి వివరాలు ఆరా తీస్తున్నారు. లబ్ధిదారుడి వద్ద వున్న ఇంటి పట్టా, తహసీల్దార్ కార్యాలంలోని ఒరిజినల్ రిజిస్టర్‌లో వున్న జాబితాతో సరిపోలుస్తున్నారు. దీంతో పాటు నకిలీ పట్టాల విషయంలో అణువణువూ తనిఖీ చేస్తున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అనర్హులకు ఇళ్లపట్టాల మంజూరుపై క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, నిదానమైనా నిక్కచ్చిగా విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. కాగా ఈ లేఅవుట్‌లో ఇంటి పట్టాలు కొనుగోలు చేసిన అమాయకుడు తాము మోసపోయామని లబోదిబో మంటున్నారు. కొందరేమో తాము డబ్బు ఇచ్చిన దళారుల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకుంటున్నారు.

కడుపు ఎండగడుతున్న క్వారీలు..

- ఆవేదన వ్యక్తం చేసిన స్థానికులు
- తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ
- హాజరైన వారికి రూ.500 తాయిలం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్,



డబ్బు పంచుతున్న క్వారీ ప్రతినిధులు

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): క్వారీల కారణంగా తమ కడుపులు ఎండుతున్నాయని, క్వారీల ఏర్పాటుకు ముందు ఒక విధంగా, తర్వాత మరో విధంగా యాజమాన్యాలు ప్రవర్తిస్తున్నాయని మదనపల్లె మండలం కోటవారుపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, కడప పొల్యూషన్ కంట్రోల్ ఇంజనీర్ కె.సుధ, తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో గురువారం కలర్ గ్రానైట్ క్వారీయింగ్‌కు అనుమతించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. క్వారీ ఏర్పాటుపై అభ్యంతరాలు తెలపాలని సబ్‌కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ 12 క్వారీలకు తాము అభ్యంతరం తెలపలేదని, కాని క్వారీ యజమానులు ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆరోపిరు. ఈ క్వారీల చుట్టుపక్కల పంట పొలాలు దుమ్ము, ధూళితో నిండిపోయి, బోర్లు ఎండిపోతున్నాయన్నారు. పర్యావరణవేత్తలుగా చెప్పుకున్న ఎన్‌జీఓలు క్వారీ అనుమతికి అభ్యంతరం లేదని చెప్పేశారు. దీనిపై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు చెప్పిన అభ్యంతరాలు, ఎన్‌జీఓల అభిప్రాయాలను రికార్డు చేసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు పంపుతామన్నారు. సమావేశం పూర్తి కాగానే ఈ క్వారీ చుట్టుపక్కల గ్రామాలైన బండకిందపల్లె, ఉడుంవారిపల్లె, కోటవారుపల్లె, కొత్తపల్లె గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు క్వారీ నిర్వాహకులు అన్నం పొట్లాలు ఇచ్చి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పంచిపెట్టారు. ఈ విషయంపై కోటవారుపల్లె సర్పంచ్ నారాయణస్వామి మాట్లాడుతూ ఈ నాలుగు పల్లెల్లో సమావేశం గురించి దండోరా వేశారని, ప్రజలందరూ స్వచ్ఛందంగానే వచ్చారన్నారు. అన్నం, డబ్బు తీసుకోవడానికి ప్రజలు అలవాటు పడిపోయారన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లె ఉపసర్పంచ్ ఎన్. నంద కుమార్, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

నాటు బాంబు పేలి ఆవుకు గాయాలు



నాటు బాంబు పేలడంతో గాయపడిన పాడి ఆవు

గుర్రంకొండ, మార్చి 6(ఆంధ్ర జ్యోతి):అడవి పందుల కోసం వేటగాళ్ల అమర్చిన నాటు బాంబును కొరకడంతో పాడి ఆవు తీవ్రంగా గాయపడింది. ఆవు యజమాని నాగరాజ తెలి పిన వివరాల మేరకు మండలంలోని సంగసముద్రం పంచాయతీ మామిళ్ల వారిపల్లెకు చెందిన డి. నాగరాజ, రేవతి దంపతులు పాడి ఆవులను పోషిస్తుంటారు. గురువారం మేత కోసం పొలంలో వదిలిన సమయంలో ఒక ఆవు వేటగాళ్ల అమర్చిన నాటుబాంబు ను కొరికింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో నాగరాజ దంపతులు పరుగెత్తి చూడగా ఆవు నోటి భాగం తీవ్రంగా గాయపడి కనిపించింది. గాయపడిన పాడి ఆవు విలువ రూ.85 వేలు ఉంటుం దని నాగరాజు తెలిపారు. తమ పొలంలో నాటు బాంబు అమర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసు కుంటామని ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు.


వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్పీఓ నాగరాజు

తంబళ్లపల్లె, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో నాగరాజు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని కుక్కరాజుపల్లె, కన్నెమడుగు, తంబళ్లపల్లె సచివాలయాలతో పాటు డంపింగ్‌యార్డులను తనిఖీ చేశారు. పలు చోట్ల డంపింగ్‌యార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు పట్టి, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డితో కలసి సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి బృందావనాల్లో వర్మీ కంపోస్టు తయారుచేయాలన్నారు. గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగం కాకుండా సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో కృషి చేసి సంపద సృష్టించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధి లైట్లు తదితర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ దిలీప్‌కుమార్‌నాయక్, కార్యదర్శి రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పురాతన రాతి విగ్రహం లభ్యం



వెంకటేశ్వరస్వామి విగ్రహం

రైల్వేకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామం గిరిజన కాలనీకి సమీపంలో గురువారం కొన్ని వందల ఏళ్ల క్రితం నాటి వెంకటేశ్వరస్వామి విగ్రహం వెలుగుచూసింది. శెట్టిగుంట సమీపంలోనే ఉన్న శేషాచలం అడవుల్లో ఆది మానవుల సంచారం ఆనవాళ్లు, శిలాజాలు లభ్యమైన నేపథ్యంలోనే ఈ విగ్రహం కూడా బయట పడిందని గ్రామస్తులు నాగినేని వెంకటరమణ, చంద్ర తదితరులు తెలిపారు. మట్టిలో పూడుకుపోయి కనిపించిన ఈ విగ్రహాన్ని గ్రామస్తులు ఒక చోట నిలుచోబెట్టారు.

మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫారసు

రాజంపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజంపేట మున్సిపల్ పరిపాలన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. వివరాలు ఇవీ.. 2022 ఆగస్టు 4న అప్పటి మున్సిపల్ పరిపాలనాధికారులపై వచ్చిన ఆరోపణలపై అప్పటి ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా రాజంపేట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, వారికి ప్రణాళికా అధికారులు సహకరించడం, పన్నుల విషయంలో అవినీతి ఆరోపణలు రావడం తదితర అంశాలపై వారు గుర్తించారు. ఈ అంశాలపై చాలా రోజులుగా విచారణ సాగుతోంది. అయితే ఈ నెల 6న అందుకు సంబంధించిన నాటి మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారిణి లక్ష్మీ నారాయణమ్మ, మేనేజర్ శేషఫణి, సీనియర్ అసిస్టెంట్లు హరినాథ్, వెంకటమధుసూదన్, బిల్ కలెక్టర్ వెంకటరామకృష్ణ, జమాల్ అహ్మద్ తదితరులు అవినీతి ఆరోపణలకు పాల్పడినందున చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతులు అందాయి.

'మహిళా శిశు సంక్షేమం' అధికారిగా అనూరాధ

కలికిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారిగా పి.అనూరాధను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఐసీడీఎస్‌లో ఏసీడీపీఓగా పనిచేస్తున్న అనూరాధను డిప్యుటేషన్‌పై జిల్లాలో నియమిస్తూ ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎ.సూర్యకుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు

కుట్టు పనులతో మహిళలకు ఉపాధి

- 2015-16లో తొమ్మిది మండలాల్లో శిక్షణ
- మహిళా దినోత్సవం సందర్భంగా మళ్లీ ఇన్నాళ్లకు..



కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సంబేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం. మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించడంలో భాగంగా డ్వాక్రా సంఘాల ద్వారా స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 2015-16లో ఉమ్మడి కడప జిల్లాలోని 9 మండలాల్లో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి వారికి సబ్సిడీతో కుట్టు మెషీన్లను అందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా మళ్లీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది.

కుట్టు శిక్షణ ఇచ్చిన మండలాలు ఇవే..

2015-16లో సంబేపల్లె, నందలూరు, పెనగలూరు, కమలాపురం, జమ్మలమడుగు, అట్లూరు, ఖాజీపేట, వేంపల్లి, ప్రొద్దుటూరు మండలాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులకు ఒక్కో విడతలో 30 మందికి చొప్పున కుట్టు శిక్షణ ఇప్పించారు. అప్పట్లో సంబేపల్లె మండలంలో ఒక్కో బ్యాచ్‌కు రూ.17,550 చొప్పున ఖర్చు చేసి మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు వెలుగు ఏపీఎం సంజీవరాజు తెలిపారు.. ఇలా లో ఒక్కో మండలం నుంచి 90 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి సబ్సిడీతో కుట్టుమిషన్లను కూడా అందించినట్లు వెలుగు అధికారులు తెలిపారు. సంబేపల్లె మండలంలో అప్పట్లో కుట్టుమిషన్ల కోసం రూ.2,74, 659 ఖర్చు చేసినట్లు తెలియజేశారు.

కుటుంబ అవసరాలు తీరుతున్నాయి



2015-16లో మొదటి బ్యాచ్‌లో నేను సంబేపల్లె మండలంలో కుట్టుశిక్షణ పొందాను. సమయం దొరికినప్పుడు బట్టలు కుట్టడంతో ఇంటి అవసరాలకు చాలినంత ఆదాయం వస్తోంది. పండుగల సమయంలో మంచి గిరాకీ ఉంటుంది.

- జల్లా పరమేశ్వరి, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు అడ్డుకట్ట

- కొత్తచట్టం రూపొందిస్తున్న కూటమి ప్రభుత్వం
- ముసాయిదా విడుదల
- నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను క్రమబద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉపాధ్యాయుల బదిలీ చట్టం రూపకల్పనకు ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలు ఇష్టానుసారంగా జరిగాయి. సాధారణంగా కౌన్సెలింగ్ పద్ధతి ప్రకారం కాకుండా సిఫారసుల ఆధారంగా బదిలీలు సాగేవి. ఇటువంటి అక్రమాలకు తావులేకుండా ఏటా మే 31 నాటికి బదిలీలు చేపట్టి.. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయులు చేరేలా ముసాయిదా సిద్ధం చేసింది.

జిల్లాలో 1620 ప్రభుత్వ ప్రాథమిక, 127 ప్రాథమికోన్నత, 236 ఉన్నత పాఠశాలలు, 64 హైస్కూల్ ప్లస్, మొత్తం 2047 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్, వివిధ భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు 7821 మంది పనిచేస్తున్నారు. 2023 జూన్‌లో సాధారణ బదిలీల్లో సుమారు 3000 మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కాగా, బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయులు దీర్ఘకాలిక అనారోగ్యం, దివ్యాంగులుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తిష్ఠ వేస్తున్నారు. దీంతో అర్హులైన వారికి దగ్గర ఉండే ప్లేసులు దొరకవు. షెడ్యూల్ మేరకు బదిలీలు జరుగుతాయన్న నమ్మకం కూడా ఉండదు. విద్యా సంవత్సర మధ్యలోనే, ఆఖరిలోనే ఉన్నఫలంగా బదిలీ చేస్తారు. కోర్టు కేసులవల్ల ఒక్కో జిల్లాలో ఒక్కోలా ప్రమోషన్లు సాగుతాయి. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర బదిలీల నియంత్రణ చట్టం-2025 అమలులోకి తెచ్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే బదిలీల డ్రాఫ్ట్ విడుదల చేసింది. ఈనెల 7వరకు ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ అభ్యంతరాలు స్వీకరించనుంది.

అన్ని డీఎస్సీల లెక్కలు తేలుస్తూ...

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సీనియారిటీ జాబితా ముఖ్యం. గతంలో చాలా మంది టీచర్లు తాత్కాలిక అవసరాల కోసం బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధిపొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని సైతం అడ్డగోలుగా నమోదు చేసుకున్నారు. కొందరు తాము అపాయింట్ అయిన డీఎస్సీ, నియామక తేదీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ వివరాలను టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీస్)లో సైతం తప్పుగా పొందుపరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టీచర్ల సీనియారిటీ జాబితాను పూర్తిగా క్రమబద్ధీకరిస్తోంది. నెల రోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ, ఐటీసెల్ అధికారులు దీనిపై కసరత్తు చేస్తున్నారు. డీఎస్సీలు 1982, 1984, 1989, 1994, 1998, 2000, 2002, 2014, 2018 టీచర్ల వివరాలు సేకరించి సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు.

చాలా సమస్యలకు పరిష్కారం

ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం క్షేత్రస్థాయిలో అమల్లోకి వస్తే చాలా సమస్యలకు తెరపడే అవకాశం ఉంది. విద్యా సంవత్సర మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియ జరగనుం ది. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి భవిష్యత్‌లో సమస్య లేకుం డా శాశ్వతమైన సీనియారిటీ జాబితాను విద్యాశాఖాధికారులు సిద్ధం చేస్తున్నారు. దీంతో మెజార్టీ వర్గాలకు న్యాయం చేకూరే అవకాశాలున్నాయి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, బోగస్ దివ్యాంగ సర్టఫికెట్లు పెట్టి లబ్ధిపొందాలనుకునే వారికి కూడా చెక్ పెట్టే అవకాశం ఉంది. రెండేళ్లు, మూడేళ్లకు బదిలీలు చేపట్టేవారు ఇకపై ఏటా నిర్వహిస్తామంటుండటం శుభపరిణామం. దీనిపై మెజార్టీ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకరిద్దరు మాత్రం లోపాలున్నాయని చెబుతున్నారు. తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని సవరించాలని కోరుతున్నారు.

అన్యాయం జరిగితే..



ఉపాధ్యాయుల బదిలీలలో అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లేందుకు అనుమతి కల్పించాలి. మూడు సంవత్సరాలలో పదవీ విరమణ పొందే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలి. 60శాతం దాటిన విభిన్న ప్రతిభావంతులదరికి ప్రిఫరెన్షియల్ కేటగిరీలో వెసులుబాటు కల్పించాలి. 117 జీఓ రద్దు వలన సర్‌ప్లస్ అయిన టీచర్లకు లాంగ్ స్టాండిగ్ పాయింట్ ఇవ్వాలి.

- రామాంజనేయులు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి



వెబ్‌కౌన్సెలింగ్ స్థానంలో ఎస్‌జీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. పాఠశాల కేటగిరీలో ఖాళీల బ్లాకింగ్ విధానం పై, సర్వీస్ పాయింట్లు, స్పెషల్ పాయింట్లు, ప్రిఫరెన్షియల్ కేటగిరీపై మార్పులు తీసుకురావాలి. పదోన్నతులకు అన్న కేటగిరీల ఖాళీలు చూపించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

పరిమిత ప్రయోజనమే...



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బదిలీల డ్రాఫ్ట చట్టం వల్ల ఉపాధ్యాయులలో భేదాభిప్రాయాలు ఉత్పన్నమవడం తప్ప పెద్దగా ఒరిగేదేమీ లేదు. దాదాపు ప్రస్తుతం ఉన్న 90శాతం నిబంధనల్లో పెద్దగా మార్పు లేదు. పెర్ఫార్మెన్స్ పాయింట్ల వంటి వివాదాస్పదమైన అంశాలను తొలగించాలి. జీఓ 117 రద్దు, మోడల్ పాఠశాలల ఏర్పాటు, హైస్కూల్ ప్లస్‌ల రద్దు వంటి అంశాల వల్ల రాబోయే సంవత్సరాల్లో విద్యా వ్యవస్థకు తీరని నష్టం జరుగుతుంది.

- కె.సురేష్‌బాబు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, ఎస్‌టీయూఏపీ

వీరభద్రుని ఆదాయం రూ.9.84 లక్షలు

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం శాశ్వత హుండీల్లోని డబ్బులను తహసీల్దారు రమాకుమారి, జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, దేవస్థానం ఛైర్మన్ పెరుగు వీరనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా వీరభద్రస్వామికి రూ.9,25,769, భద్రకాళి అమ్మవారికి రూ.58,717 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకలబాబు, గోసుల వీరారెడ్డి, వీరనారాయణ, కమిటీ సభ్యులు, పోలీసులు, గోవింద మాల సేవా మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

తలనీలాల వేలంపాట రూ.66 లక్షలు

చక్రాయపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాలు పోగుచేసుకునేందుకు నిర్వహించిన వేలంలో సికింద్రాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైయిటర్ పి.ఆదినారాయణ రూ.66లక్షలకు పాడి వేలాన్ని దక్కించుకున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం గండి కార్యాలయంలో వేలం నిర్వహించగా ఐదుగురు గుత్తేదారులలు పాల్గొన్నారన్నారు. గత ఏడాది రూ.65.11లక్షలు పలుకగా ఈ ఏడాది రూ.66లక్షలు పలికిందన్నారు. వేలం దక్కించుకున్న వారికి 01.04.2025 నుంచి 31.03.2026 వరకు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీదారులు శివయ్య, ఆలయ మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, బ్యాంకు, పోలీసులు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల పంపిణీని సద్వినియోగం చేసుకోండి

- వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ క్రిష్ణకిశోర్

కడప మారుతీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాళ్లు విరిగిన వారికి ఈనెల 7న శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కడప కలెక్టరేట్‌లో కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ క్రిష్ణకిశోర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక దరఖాస్తుల స్వీకరణ స్థలంలో చెన్నైకి చెందిన ఫ్రీడం ట్రస్టు ద్వారా యాక్స్ హెల్త్ కేర్ సహకారంతో కృత్రిమ కాళ్ల పంపిణీకి అవసరమైన కొలతలను వికలాంగుల నుంచి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఒక్కో కృత్రిమ కాలు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని.. అవసరమైన వారికి ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించినట్లు వైవీయూ ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. గురువారం వైవీ నా ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.విజయభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలను పొందేందుకు విద్యార్థులు విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. దివీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్, శ్రీచైతన్య స్కూల్స్ ప్రతినిధులు రాత పరీక్ష ఇంటర్వ్యూ, డెమో ద్వారా వారి సంస్థలకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు. ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు రెడ్డయ్య, గణేష్‌నాయక్, డాక్టర్ కె.లలిత విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుశాఖకు జాగిలాల సేవలు అమోఘం

- జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు



పోలీసు జాగిలాలను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖకు జాగిలాలు వాఘా ఝాన్సీ 11 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించాయని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు కొనియాడారు. గురువారం సాయంత్రం స్థానిక పెన్నార్ పోలీసు హాలులో వాఘా, ఝాన్సీ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరులుగా పేరుగాంచిన లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన జాగిలాలు వాఘా, ఝాన్సీలను అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్లు పీరయ్య, బీవీ క్రిష్ణయ్యలను అదనపు ఎస్పీ అభినందించారు. పలు సీఎం బందోబస్తు విధులు, వీవీఐపీ, వీఐపీల విధులు, క్రిష్ణా, గోదావరి పుష్కరాల్లో, తిరుమల బ్రహ్మోత్సవాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి పలుమార్లు ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం వాఘా, ఝాన్సీలను మేళతాళాలతో బాణసంచా కాల్చుతూ వాటి విడిది గృహాల వద్దకు చేర్చి ఘనంగా వీడ్కోలు పలికారు. ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు శివరాముడు, వీరేశ్, శ్రీశైల రెడ్డి, టైటస్, ఆర్ఎస్ఐలు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ టీం, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



మోషే (ఫైల్‌ఫొటో)

మైలవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిరపపంటలో ఆశించిన దిగుబడి రాకపోవడం... పండిన పంటను కొనుగోలు చేసేవారు లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం మైలవరం మండలంలో చోటు చేసు కుంది. పోలీసులు, బంధువుల వివరాల మేరకు... మండ లంలోని దుగ్గనపల్లెకు చెందిన చీపాటి మోషే (52) అనే రైతు తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 1.40 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరపపంట సాగు చేశాడు. ఎకరాకు రూ.2 లక్షల మేర దాదాపు 12 లక్షల వరకు పంటసాగుకు అప్పులు చేసి పెట్టు బడి పెట్టాడు. మిరప కోత అనంతరం రెండు రోజుల క్రితం గుంటూరు మార్కెట్‌కు మిరపకాయలు తీసుకెళ్లాడు. అయితే మిరప కాయలపై దుమ్ము ధూళి ఉండటం.. మిరప నాణ్యత సరిగా లేకపోవడంతో ఎవ్వరూ కొనుగోలు చేయలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక.. తీవ్ర మనస్థాపానికి గురై గురువారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి మృతి చెందాడు. కుటుం బసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహా న్ని పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి కుమారుడు, ఇద్ద రు కుమార్తెలు ఉన్నారు. కాగా, ఈ ఏడాది దాల్మియా పరి శ్రమ నుంచి వచ్చే దుమ్ము ధూళితో మిరప పంట దిగుబ డి సరిగా రాక.. ధర లేకపోవడంతో మనస్థాపానికి గురై మృతి చెందినట్లు మోషే తండ్రి స్వామిదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



ముద్దనూరు మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె సమీపంలో కడప- తాడిపత్రి హైవే పక్కన గురువారం బుల్లి అశోక్(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం భద్రంపల్లెకు చెందిన బుల్లి అశోక్‌కు 10 సంవత్సరాల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన అమ్మాయితో వివాహమైంది. 3 సంవత్సరాల క్రితం భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తను విడిచి వెళ్లింది. అప్పటి నుంచి అశోక్ మద్యంకు బానిసయ్యాడు. 15 రోజుల క్రితం భార్య వద్దకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లి తిరిగి వచ్చాడు. బుధవారం మళ్లీ భార్య వద్దకు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే కొత్తపల్లె సమీపంలోని రోడ్డు పక్కన మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

కువైట్‌లో గోపవరం వాసి మృతి

గోపవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడి మూడునెలలు మృత్యువుతో పోరాడి.. చివరకు మృతి చెందాడు. గోపవరం మండలం అడుసువారిపల్లెకు చెందిన వంతెరపల్లె రమణారెడ్డి (53) కువైట్‌లో సెంట్రింగ్ పనులు చేస్తుండగా స్టీలు రాడ్లు మీద పడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ రమణారెడ్డి చికిత్స పొందుతూ మార్చి 2న మృతి చెందాడు. కాగా గురువారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఇద్దరి మృతి

- ఏడుగురికి గాయాలు





మృతి చెందిన ముత్తరాసు లక్ష్మమ్మ, అంజనేయులు (ఫైల్)

ఎర్రగుంట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గనిలో కూలి పని కోసం ట్రాక్టర్‌లో కూలీలు వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా... మరో ఏడుగురు గాయపడ్డారు. వివరాల్లోకెళితే... గురువారం ఉదయం చిలమకూరులో గనిలో పని కోసం ట్రాక్టర్‌లో ఎన్‌హెచ్ రోడ్డు నుంచి బయలుదేరారు. అదే సమయంలో మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్‌జేఎల్ 7081 నెంబరుగల లారీ వెనుకవైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ట్రాక్టర్ పడిపోవడంతో ట్రాక్టర్‌లో ఉన్న ముత్తరాసు లక్షుమ్మ (56) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ వెంకట అంజనేయులు (52) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే ట్రాక్టర్‌లో ఉన్న ఓబయ్య, హరినాథ్, చిన్న ఓబన్న, గుర్రప్ప, పొన్న వెంకటసుబ్బయ్య, బాల స్వామి, మల్లేల రోశయ్యలు గాయపడ్డారు. అర్బన్ సీఐ నరేష్‌బాబు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

వన్యప్రాణిని వేటాడిన ఇరువురిపై కేసు నమోదు

- నాటుతుపాకీ, జింక మాంసం స్వాధీనం

వేంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఫారెస్ట్ బీట్ కప్పలమడుగు ప్రాంతంలో వన్యప్రాణిని వేటాడిన వ్యవహారంలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. కుమ్మరాంపల్లెకు చెందిన శ్రీరాములు, నటరాజలు రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో నాటుతుపాకీతో వన్యప్రాణులను వేటాడారు. సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించగా శ్రీరాములు పట్టుబడ్డాడు, నాటుతుపాకీతో పాటు జింకమాంసం స్వాధీనం చేసుకున్నారు. నటరాజ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

పులివెందులటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఉలిమెల పొలాల్లో బుధవారం రాత్రి కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు గురువారం ఫారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతి చెందిన జింకను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల పశువైద్యశాలకు తరలించారు. డాక్టర్ రవికిరణ్‌రెడ్డి జింకకు పోస్టుమార్టం చేసి ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

నిధులు కొండంత.. ఫలితం గోరంత

గత జగన్ ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా చేపట్టిన నాడు - నేడు పనులన్ని నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. జగన్ ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా ఏ పనీ పూర్తి కాలేదు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని అనేక పాఠశాలల్లో పనులన్నీ నిలిచి పోయి ఉన్నాయి. నిధులలేమి, పర్యవేక్షణా లోపం వల్ల పనులు ఆగిపోయాయి. నాడు-నేడు పనుల వల్ల పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం శూన్యం.

ఆంధ్రజ్యోతి పరిశీలన



దేవపట్ల హైస్కూల్‌లో పనులు నిలిపేయడంతో నిరుపయోగంగా గ్రానైట్ బండలు

రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో నాడు-నేడు పనులు అసంపూర్తి

రాజంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని 46 పాఠశాలల్లో ఈ పనులను ప్రారంభించారు. ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు పునర్నిర్మించాలని ఏకంగా రూ.47 కోట్ల నిధులు విడుదల చేశారు. 50 శాతం కూడా నిధులు మంజూరు కాక పోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ విషయమై ఆంధ్రజ్యోతి గురువారం మన్నూరు ఉన్నత పాఠశాలను పరిశీలించగా ఈ పాఠశాలకు రూ.1.20 కోట్లు విడుదల చేశారు. 14 గదుల నిర్మాణానికి నిధులు విడుదల చేయగా అందులో ఇప్పటి వరకు 10 రూములు పైబడి అసంపూర్తిగా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలో 42 పాఠశాలల్లో ఈ పనులు చేపట్టగా ఇప్పటి వరకు 28 పాఠశాలల్లోనే ఓ మోస్తారుగా పనులు పూర్తి చేశారు. ఏకంగా 14 పాఠశాలల్లో నిధుల కొరత వల్ల పనులే జరగలేదు. రైల్వేకోడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించగా పనులన్ని అర్ధాంతరంగా ఉన్నాయి. ఓబులవారిపల్లె మండలంలో 37 పాఠశాలల్లో ఈ పనులను చేపట్టగా అన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. చిన్నఓరంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, జూనియర్ కళాశాలను ఆంధ్రజ్యోతి పరిశీలించగా అన్ని గదులు అసంపూర్తిగానే ఉన్నాయి. జూనియర్ కళాశాలకు రూ.5.46 కోట్లు మంజూరైనా ఇంతవరకు పనులు పూర్తి కాలేదు. ఓబులవారిపల్లె అంగన్వాడీ కేంద్రం, తెల్లంవారిపల్లె జడ్పీ హైస్కూల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కస్తూర్బా విద్యాలయంలోనూ ఇదే పరిస్థితి. పుల్లంపేటలో కేజీబీవీ పాఠశాలలో అర్ధంతరంగా పనులు నిలిపేశారు. సుండుపల్లె మండలంలో నాడు-నేడు కింద 22 పాఠశాలలను ఎంపిక చేసినా అన్ని పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. జి.రెడ్డివారిపల్లె పాఠశాలను పరిశీలించగా పనులు పూర్తి కాలేదు. ఇదేవిధంగా పెనగలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, చిట్వేలి, వీరబల్లె మండలాల్లో కూడా నాడు-నేడు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయి ఉన్నాయి. దీనివల్ల విద్యార్థులకు కలిగిన ప్రయోజనం శూన్యమని ఈ సందర్భంగా ప్రజలు పేర్కొంటున్నారు.




రాజంపేట: అసంపూర్తిగా ఉన్న మన్నూరు పాఠశాల భవనం





రైల్వేకోడూరు హైస్కూల్‌లో ఆగిపోయిన పనులు... సుండుపల్లె: జి.రెడ్డివారిపల్లె ఉన్నత పాఠశాలలో పూర్తికాని పనులు





ఓబులవారిపల్లె: జూనియర్ కళాశాలలో పనులు ఆగిన దృశ్యం... పుల్లంపేట: కేజీబీవీ పాఠశాలలో...

రాయచోటి నియోజకవర్గంలో...

సంబేపల్లె/సుండుపల్లె/, గాలివీడు/, చిన్నమండెం/ రామాపురం/లక్కిరెడ్డిపల్లె(ఆన్‌లైన్ విజట్) మార్చి6(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన నాడు- నేడు పాఠశాల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నేటికీ వినియోగంలోకి రాలేదు. లక్షలు ఖర్చు పెట్టినా ఫలితం మాత్రం లేదు. పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ప్రభుత్వం మారాక నిధులు రాలేదు. పనులు మధ్యలో ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు నాడు- నేడుపై స్పష్టత లేదు. నిధులు వస్తాయా రావా అన్న సందిగ్ధంలో ప్రధానోపాధ్యాయులు ఎదురుచూపులు తప్పడం లేదు. సంబేపల్లె మండలంలో రెండవ విడత నాడు- నేడు కింద 40 పాఠశాలలు ఇచ్చారు. ఇందులో ఐదు హైస్కూల్స్, 17 అంగన్వాడీలు ఉన్నాయి. 18 ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం అక్కడ పనులు పూర్తి అయిన పరిస్థితి లేదు. అసంపూర్తినే ఉన్నాయి. దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు భవనాలు ఒక్కొక్క భవనం 12 లక్షల చొప్పున ఆరు భవనాలను కట్టి మధ్యలోనే వదిలేశారు. ప్రస్తుతం పాఠశాలలో సిమెంటు, కిటికీలు, తలుపులు, డోర్లు సామాగ్రి గ్రానైట్ బండలు నిరుపయోగంగా ఉన్నాయి. సుండుపల్లె మండలంలో రెండో విడతలో 22 పాఠశాలలు ఎంపిక చేశారు. రాయవరం, తిమ్మసముద్రం, జీ. రెడ్డివారిపల్లె, మడితాడు ఉర్దూ, పింఛా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గదులు నిర్మించాల్సి ఉంది. నేటికీ 60 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 659 కోట్లు నాడు- నేడు పనులు ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో మూడు అంగన్వాడీ కేంద్రాల్లో 26 ప్రాథమిక పాఠశాలలు మంజూరయ్యాయి. ఒక్కటి కూడా పూర్తి కాలేదు. రామాపురం మండలంలో రెండో విడతలో 33 పాఠశాలలు మంజూరయ్యాయి. కోటి 71 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పనులు మాత్రం అసంపూర్తిగానే ఉన్నాయి. చిన్నమండెం మండలంలో నాడు- నేడు పనులు పునాది దశలోనే ఉన్నాయి. ఉర్దూ హైస్కూల్‌లో నాడు- నేడులో మూడు అదనపు తరగతి గదులకు 89 లక్షలు మంజూరు కాదు. ఇంకా ఆరు లక్షల రూపాయలు అకౌంట్‌లో ఉన్నప్పటికీ పాఠశాల పనులు నిలబెట్టాశారు.



దేవపట్ల పాఠశాలలో నిరుపయోగంగా కిటకీలు, తలుపులు సామగ్రి

సంక్షిప్తం

ఇష్టపడి చదవాలి



విద్యా సామగ్రిని అందజేస్తున్న కరస్పాండెంట్ నాగేశ్వరరావు

సుండుపల్లె, మార్చి6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ కరస్పాండెంట్ రెడ్డిచర్ల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు.ఆ పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు.

అట్టలు, పెన్నులు పంపిణీ

ఓబులవారిపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డీఆర్ హరిత, సిబ్బంది గురువారం అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లె, తల్లెంవారిపల్లె, జడ్పీ హైస్కూల్, పుల్లంపేట, అనంతంపల్లె జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

'ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి'

రైల్వేకోడూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్యను త్వరగా పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయన్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోవాలన్నారు.నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మొగిలి వినయ్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల తనిఖీ

పెనలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను గురువారం సిట్టింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసులరెడ్డి, డిపార్టుమెంట్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. మూడు గంటల సేపు తనిఖీ చేసినట్లు వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

పెనగలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చక్రంపేట ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బి.సుమియా ఇన్సైర్ మనాక్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.పది వేల నగదు బహుమతిని అందుకోనున్నారు. గురువారం ఎంఈవో-1 గిరివదరయ్య జ్ఞాపికను బహూకరించారు.

మూతపడ్డ పశువైద్యశాల

సిద్దవటం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జ్యోతి గ్రామంలోని పశువైద్యశాల గురువారం మూత పడటంతో పాడి రైతులు అగచాట్లు పడ్డారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాకూబ్‌బాషా గురువారం విధులకు హాజరు కాలేదు. వెటర్నరి సిబ్బంది లేకపోవడంతో పాడి రైతులు వెనుదిరిగారు. వెటర్నరి వైద్యాధికారిని డాక్టర్ శ్వేతను వివరణ కోరగా లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాకూబ్‌బాషా విధులకు హాజరు కాకపోవడంపై తమకు సమాచారం లేదని, చర్యలు తీసుకుంటామన్నారు.

దాతల సేవలు మరువలేనివి

గాలివీడు, మార్చి(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థకు దాతల సేవలు మరువలేనివని మాజీ వైస్ ఎంపీపీ మోపూరి రమణయ్య, మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గుండ్లచెరువు పంచాయతీ మోపూరివాండ్లపల్లెకు చెందిన దివంగత ఉప్పు గంగయ్య, సురేశ్‌ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులైన ఉప్పు రామసుబ్బమ్మ, ఉప్పు రాజేశ్, పద్మావతి, గణేశ్‌లు రూ.80 వేలు విలువ చేసే బాడీ ఫ్రీజర్‌ను మానవతా సంస్థకు గురువారం అందజేశారు.

'మద్దతు ధర కల్పించాలి'

చిన్నమండెం, మార్చి6(ఆంధ్రజ్యోతి): కూరగాయల పంటలకు మద్దతు ధరలు ప్రకటించి ప్రభుత్వమే సేకరించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీ శివయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ దిన్నెమీదపల్లె, పలు గ్రామాల్లో పర్యటించి టమోటా, వంగ, దోసకాయ, వేరుశనగ పండించే రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

108లో ప్రసవం

ఓబులవారిపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొంతవారిపల్లెకు చెందిన మహిళ గురువారం 108లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. మంగళపూరి లావణ్య(19)కు గురువారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో ఆమెను 108లో తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. ఈఎంటీ శైలజ ఆధ్వర్యంలో ఆమెకు ప్రసవం చేసి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చార్జిషీట్ ఓపెన్ చేస్తా

● కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కడప డీఎస్పీ

సిద్దవటం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా చేస్తే వాహనదారులపై చార్జిషీట్ ఓపెన్ చేస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్దవటం స్థానిక పోలీసుస్టేషన్‌ను గురువారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలను మైన్స్ ఆర్డీవోలకు పంపడంతో పాటుగా షీట్స్ ఓపెన్ చేస్తామన్నారు. బాకరాపేటలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. వేసవి కాలంలో బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు విలువైన బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలు జరగకుండా ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒంటిమిట్ట సీఐ టి.బాబు, ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

వీరబల్లి మండల కమిటీ ఎన్నిక

వీరబల్లి, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఏపీడబ్ల్యుజే వీరబల్లి మండల నూతన కమిటీని గురువారం ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరుల హక్కుల కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులు అందరూ ఏకమై తమ అవసరాలను తీర్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నారపరాజు రమేశ్‌కుమార్‌రాజు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షుడు పల్లం తాతయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

గాలివీడు, మార్చి6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి అత్యున్నత స్థాయి ఎదగాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు పోలీసు ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం

చిన్నమండెం, మార్చి6(ఆంధ్రజ్యోతి): ప్రణాళికతో చదివితే విజయం సాధ్యమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్ అన్నారు. గురువారం మల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

సిద్దవటం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలంలోని డేగనవారిపల్లె, లింగంపల్లె, మాచుపల్లె తదితర పెన్నా పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని రైతులు విన్నవిస్తున్నారు. మండల ఇన్‌చార్జ్ తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు.

సబ్సిడీ రుణాల్లో అర్హులకు మొండిచేయి

నందలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బీసీ, కాపు, ఓసీ కార్పొరేషన్లకు సబ్సిడీ రుణాల కోసం గతనెల 18న 54 యూనిట్లు కోసం 379 మంది దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కాని కేవలం టీడీపీ నాయకులు ఎవరికి చెబితే వారికి మాత్రమే ఎంపీడీవో రాధాకృష్ణంరాజు అర్హులుగా ప్రకటిస్తానని బాహాటంగానే చెప్పడం గమనార్హం. 54 మందిని కూడా ఒక పార్టీకి చెందిన వారిని ఎంపిక చేయడంతో విషయం తెలుసుకున్న బీజేపీ, జనసేన నాయకులు గురువారం మధ్యాహ్నం ఎంపీడీవోతో వాగ్వాదానికి దిగారు. చివరకు బీజేపీ నాయకులకు సంబంధించి నలుగురికి, జనసేనపార్టీకి సంబంధించి ముగ్గురికి యూనిట్లు మంజూరు చేస్తామని చెప్పడంతో బీజేపీ, జనసేన నాయకులు వెనుదిరిగారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు: పీడీ

గాలివీడు, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవకతవకలు పాల్పడితే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం సిబ్బందిని హెచ్చరించారు. గురువారం మండలంలోని గాలివీడు, గోరాన్‌చెరువు, నూలివీడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

గురుకుల ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఓబులవారిపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఐదో తరగతి, మొదటి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మన్సూర్‌అలీ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి, ఇంగ్లీషు మీడియం, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌ద్వారా నమోదు చేసుకోవడానికి మార్చి 13 వరకు అవకాశం ఉందన్నారు.

మహిళా దినోత్సవానికి చమర్తికి ఆహ్వానం



ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న చమర్తి

రాజంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరగనున్న ఆర్టీసీ మహిళా దినోత్సవానికి టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజును ఆహ్వానించారు. రాజంపేట పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. జగన్‌మోహన్‌రాజు ఆర్టీసీ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ నాయకులు రమణ, జిల్లా కార్యదర్శి బీసీ శేఖర్, సీనియర్ నాయకులు చలపతి, డిపో గౌరవాధ్యక్షుడు మాథ్యూస్, డిపో అధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాయచోటి పట్టణంలో హిందూ-ముస్లిం ఐక్యత ఉంది'

రాయచోటిటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో హిందూ-ముస్లిములం ఐక్యంగా ఉన్నాం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. గురువారం ఆయన రాయచోటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా స్థానిక ముస్లింలు సోదర భావంతో వ్యవహరించారన్నారు. మంగళవారం జరిగిన ఘటనను గమనిస్తే పార్వేట పల్లకి వెనుక భాగం నుంచి రాయచోటి వాసులు కాకుండా ఇతరులు వచ్చి ఈ ఘటనకు దారి తీసినట్లు తెలుస్తోందన్నారు. కావున ఎస్పీ వీటిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రిప్పు కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్),మార్చి6(ఆంధ్రజ్యోతి):రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నమయ్య జిల్లా ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం ద్వారా డబ్బు చెల్లించి ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఏడు సంవత్సరాల క్రితం మైక్రో ఇరిగేషన్ (డ్రిప్పు)లో రాయితీలు పొందిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐదు ఎకరాలు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ, 10 ఎకరాలు ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9182296556కు సంప్రదించవచ్చునని ఆమె తెలిపారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలల్లో రాణిస్తున్నారని లక్కిరెడిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం అంగన్‌వాడీ కార్యాలయ సిబ్బంది పద్మావతిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతున్న మహిళల పట్ల గౌరవంతో వ్యవహరించాలని కోరారు. ఈ కర్యాక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దాద్‌బీ, సుజాత, లక్ష్మీదేవి, పద్మజారాణి, సోని, హుస్సేనమ్మ, అరుణకుమారి, సీనియర్ అసిస్టెంట్ గణేస్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి, అంగన్‌వాడి వర్కర్లు పాల్గొన్నారు.

ఏపీని అప్పులమయం చేసిన జగన్ : జనసేన

రాయచోటిటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అప్పులు పాలు చేశారని జనసేన పార్టీ కడప, రాజంపేట పార్లమెంట్‌ల సమన్వయకర్తలు సుంకర శ్రీనివాస్, అతికారి కృష్ణ ధ్వజమెత్తారు. గురువారం రాయచోటి పట్టణంలోని బీహెచ్ మినీ ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ నాయకుడు బుడ్డా నాగభూషణం ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా వారు ఈ నెల 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలో జరగనున్న జనసేన ఆవిర్భావ సభకు సంబంధించిన 'చలో పిఠాపురం' విజయవంతం చేద్దాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు.

'మత సామరస్యం మన బాధ్యత'

రాయచోటిటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మనిషికి మతం అనేది వ్యక్తిగతమని, అయితే మతసామస్యం బాధ్యతగా భావించాలని ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద శాంతి సంఘీభావం తెలిపారు. దండోరా జాతీయ నాయకుడు రామాంజనేయులు, వడ్డెర విద్యా వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్, అమానత్ సేవా సొసైటీ అధ్యక్షుడు అతావుల్లా, సహారా వెల్ఫేర్ సొసైటీ నాయకుడు అఫ్తాబ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, జనసేన నాయకులు నాగేంద్ర, పఠాన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, రైతు సంఘం నాయకుడు బసిరెడ్డి, సీఐటీయూ నాయకులు మాట్లాడారు.

దిగుబడి ఉన్నపుడు ధర ఉండకపోవడం.. ధర ఉన్నపుడు దిగుబడులు లేకపోవడం సాధారణంగా రైతులు ఎదుర్కొనే సమస్య. అయితే, ఈ ఏడాది రైల్వే కోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా నిమ్మ దిగుబడులు అధికంగా ఉండగా, అదే సమయంలో ధర కూడా ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



నిమ్మ ధరలు పైపైకి..

- ఈ ఏడాది ఆశాజనకంగా దిగుబడులు
- 50 కిలోల బస్తా రూ. 2000 దాకా..
- ఇంకా పెరిగే అవకాశం

రైల్వేకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగులో రైల్వేకోడూరు నియోజకవర్గం దక్షిణ భారతదేశంలోనే పేరు పొందింది. గతంలో ఇక్కడి నుంచి కేరళలోని ఎర్నాకుళం, తిరుచూరు, మహారాష్ట్రలోని ముంబై, కర్ణాటక రాష్ట్రంలోని హాస్పేట్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి నిమ్మకాయలు ఎగుమతి అయ్యేవి. చిన్నచిన్న వ్యాపారులు తిరుపతి, రాజంపేట, కడప, అనంతపురం, చిత్తూరు తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారు. 2000-03 మధ్య కాలంలో ఈ ప్రాంతంలో తీవ్రమైన కరువు కారణంగా నిమ్మతోటలు ఎండిపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. 2015-17 మధ్యకాలంలో దిగుబడి అధికంగా వచ్చినా ధర లేకపోవడంతో పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది అదును తప్పి కాపు రావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. అప్పట్లో ప్రతిరోజు 200 బస్తాల దాకా మాత్రమే ఎగుమతి అయ్యాయి. ప్రస్తుతం 400 బస్తాలు ఒక్క ఎర్నాకుళంకే వెళుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది కాపు బాగా ఉండగా, అందుకు తగినట్లు డిమాండు కూడా ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం మొదటి రకం నిమ్మ కాయలు 50 కిలోల బస్తా రూ.1500 నుంచి రూ.2000 వరకు ధర పలుకుతోంది. మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర బాగుంది



ధరలు బాగా ఉన్న సమయంలో దిగుబడి లేక పోవడం, దిగుబడి ఉన్న సమయంలో ధర లేక ఇబ్బందు లు పడేవాళ్లం. ప్రస్తుతం నిమ్మ కాయలకు డిమాండు బాగా ఉంది. దిగుబడి కూడా బాగానే ఉంది.

- మలిశెట్టి మాధవయ్య, రైతు, వెంకటరాజుపల్లె

పది రూపాయలకు రెండు కాయలు

పట్టణంలో రెండు నిమ్మకాయలను రూ. 10కి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో డిమాండు పెరిగింది. తోటల వద్దే పచ్చికాయలు కూడా అమ్మేస్తుండడంతో పండ్లు దొరకడం కష్టంగామారిందని వినియోగదారులు అంటున్నారు.



నిమ్మకాయలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సెంటు భూమి కూడా వదలం..

- నల్లారి చొరవతోనే ఆక్రమణలపై విచారణ
- ఆక్రమణదారులపై కఠిన చర్యలు
- పీలేరులో కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమీక్ష సమావేశంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

పీలేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పోరాటాల ఫలితంగానే పునఃప్రారంభమైందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. 'సర్కారీ భూములు స్వాహా, నాడు చెరపట్టిన వైసీపీ నేతలు' అన్న శీర్షికతో పీలేరు మండలంలో భూఆక్రమణలపై ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ విషయంపై గురువారం ఆయన పీలేరులో మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్న ఆక్రమణల జాబితాలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో పేర్కొన్న పలు సర్వే నెంబర్లు ఉండడంతో ఇప్పటికే కొన్నింటిని తొలగించామని, మరికొన్ని సర్వే నెంబర్లపై విచారణకు స్థానిక అధికారులను ఆదేశించామన్నారు. ఆక్రమణదారుల చెరలో ఉన్న చివరి సెంటు ప్రభుత్వ భూమిని విడిపించే వరకు విశ్రమించబోమన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి గతంలో చేసిన ఫిర్యాదు, మదనపల్లె పూర్వ సబ్-కలెక్టర్ జాహ్నవి నివేదిక మేరకు పీలేరు మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో 600 ఎకరాల అవకతవకలపై విచారణకు 10 బృందాలను నియమించామని తెలిపారు. గడిచిన ఐదురోజుల్లో సుమారు 338 ఎకరాల మేరకు విచారణ పూర్తి చేశాయన్నారు. మరో నాలుగు రోజుల్లో విచారణ పూర్తి చేస్తాయని, ఆ తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విచారణ పురోగతిపై సమీక్షించారు.

నేనూ భూ ఆక్రమణల బాధితుడినే...

సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన తాను కూడాఆక్రమణదారుల బారిన పడి ఇబ్బంది పడిన వాడినేనని కలెక్టర్ తెలిపారు. తన చెల్లి పెళ్లి సందర్భంగా ఎంతో కష్టపడి కూడబెట్టిన రూ.4 లక్షలతో తన తల్లిదండ్రులు ఒక ఇంటి స్థలం కొనుగోలు చేశారన్నారు. అయితే ఆ స్థలాన్ని తమకు అమ్మిన రియల్టర్ ఆ స్థలం ఒక సర్వే నెంబరులో ఉంటే మరో సర్వే నెంబరు వేసి రిజిస్టరు చేసి ఇచ్చాడన్నారు. నాలుగేళ్ల తరువాత అతని మోసం బయటపడిందన్నారు. తాము గట్టిగా ఎదిరిస్తే 50 శాతం సొమ్ము వాపసు చేశాడన్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు డీకేటీ, ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారని వాపోయారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాలను స్పష్టంగా చూపించే యాప్‌గానీ, వెబ్‌సైట్ గానీ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

పీలేరు అధికారుల పనితీరు మెరుగుపడింది...

పీలేరు మండలంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారుల పనితీరు రెండు నెలల వ్యవధిలో గణనీయంగా పెరిగిందన్నారు. ఆర్‌టీజీఎస్ ద్వారా మండలంలో 550 అర్జీలు అందగా వాటిలో 500 అర్జీలు పరిష్కరించామన్నారు. రీసర్వేలో అందిన దరఖాస్తుల్లోనూ కేవలం 80 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తహసీల్దారు భీమేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూలు వ్యాను ఢీకొని ఒకరు మృతి



సంఘటనా స్థలంలో బాలయ్య మృతదేహం

పుల్లంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్కూలువ్యాను బైకును ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు ఓబులవారిపల్లె మండలం పి.కమ్మపల్లె హరిజనవాడకు చెందిన బత్తల బాలయ్య(64) మాలేపాటి రమణయ్య బైకుపై వస్తుండగా రాజంపేటలోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన స్కూలు వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు గాయపడగా హుటాహుటిన 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలయ్యను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

అతిగా మద్యం సేవించి..

పెద్దతిప్పసముద్రం మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు .. మల్లెల పంచాయతీ గొందిపల్లెకు చెందిన చౌడిరెడ్డి (55) రైతు. బుధవారం అధిక మోతాదులో మద్యం సేవించి ఇంట్లో నిద్రపోయాడు. గురువారం ఉదయం ఎంతసేపటికి నిద్ర లేవక పోవడంతో భార్య వెళ్లి పరిశీలించగా, మృతిచెందినట్లు తేలింది. మృతునికి భార్య సరోజమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

తండ్రిపై కొడుకు దాడి



చికిత్స పొందుతున్న ఖాదర్‌హుస్సేన్

సిద్దవటం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకే తండ్రిపై బండరాయితో దాడి చేసిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన ఖాదర్ హుస్సేన్‌కు అతని కుమారుడు బాబాఫక్రుద్దీన్ మధ్య తమ ఇంటిని అద్దెకు ఇచ్చే విషయంలో బుధవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహించిన కొడుకు బండ రాయితో దాడి చేయగా, తీవ్రంగా గాయపడిన తండ్రి కుప్పకూలి పో యాడు. స్థానికులు అతనిని ఒంటిమిట్టలోని ప్రభుత్వ ఆస్పత్రికి తర లించగా, ప్రాథమిక చికిత్స అనంతరం రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆస్తి కోసమే తన కుమారుడు దాడి చేశాడని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు..

నిమ్మనపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు సోమల మండలం తుమ్మినాయునిపల్లి పంచాయతీ కురవపల్లికి చెందిన శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై నిమ్మనపల్లి రోడ్డు మీదుగా మదనపల్లి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మారుతి కారు ఢీకొని వెళ్లిపోయింది. దీంతో శ్రీనివాసులు కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి బావమరిది మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

ప్రధాన రహదారిపై నల్లటి రసాయనం

- ఇబ్బంది పడిన ప్రయాణికులు
- స్పందించిన అధికారులు



రహదారిపై పడిన పౌడర్‌ను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న తపాలా కార్యాలయం సమీపంలో నల్లటి పౌడర్‌తో కూడిన బ్యాగ్ రోడ్డుకు అడ్డంగా పడడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుధవారం అర్ధరాత్రి చెన్నై నుంచి తాడిపత్రికి వెళుతున్న లారీ నుంచి ఈ బ్యాగ్ జారిపడింది. విషయం తెలుసుకున్న లారీ డ్రైవర్ జేసీబీ సాయంతో దానిని తిరిగి లారీలో లోడ్ చేయిస్తుండగా జారిపడి పగిలిపోయింది. దీంతో అందులోని పౌడర్ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. దీంతో లారీ డ్రైవర్ పరారయ్యాడు. గురువారం ఉదయం పంచాయతీ అధికారులు నీళ్లతో రోడ్డును శుభ్రం చేశారు.

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడి మృతి



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఎర్రగుంట్ల, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీపీపీ పాత కోల్ ప్లాం టులో పనిచేస్తున్న కార్మికుడు హఠాత్తుగా మృతి చెందాడు. .తాడిపత్రికి చెందిన నాగరాజు(40)గురు వారం సాయంత్రం విధి నిర్వహణలో ఉన్న పళంగా కుప్పకూలడంతో అతనిని ప్లాంటు ఆసు పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం తరలిస్తుండగా మధ్యలో మృతిచెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మృతికి కారణమంటూ మృతుడి భార్య, బంధువులు ధర్నాకు దిగారు. మృతుడి భార్యకు ఉద్యోగంతో పాటు, ఆర్థిక సహాయం కూడా చేసేందుకు అధికారులు ఒప్పుకోవడంతో వారు ధర్నా విరమించారు.

మహిళా సాధికారతకు కృషి చేద్దాం

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో విద్యార్థినులతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలో పోలీసుల ఆధ్వర్యంలో మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మహిళల భద్రత, పోలీసు విధులపై విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించామని, మరింత అవగాహన కోసం ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖతో పాటు ఇతర శాఖల సహకారంతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రధానం చేస్తామని వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థినులకు పోలీసులు ఉపయో గిస్తున్న అత్యాధునిక ఆయుధాలు, బాంబ్ డిస్పోజల్స్ పరికరాలు, సాంకేతికత విజ్ఞానంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్, అదనపు ఎస్పీ చాంబర్‌తో పాటు వివిధ విభాగాల కార్యాలయాలను సందర్శించారు. పోలీసుశాఖపై ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్‌ఐలు, వీజే రామకృష్ణ, పెద్దయ్య, ఏఆర్, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'అనర్హులకే ఇళ్లపట్టాలు'పై విచారణ

- ఎనిమిది మంది సభ్యులతో కమిటీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సీటీఎం లేఅవుట్‌లో విచారణ చేస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనర్హులకే ఇళ్లపట్టాలు..అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాలతో తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో సీటీఎం-2 గ్రామం సర్వేనెంబర్ 779/2 లేఅవుట్‌లో విచారణ ప్రారంభించారు. నలుగురు వీఆర్‌ఓలు, నలుగురు విలేజ్ సర్వేయర్ల బృందాలు విడివిడిగా ప్రతి ఇంటి స్థలం వద్దకు వెళ్లి లబ్ధిదారుడి వివరాలు ఆరా తీస్తున్నారు. లబ్ధిదారుడి వద్ద వున్న ఇంటి పట్టా, తహసీల్దార్ కార్యాలంలోని ఒరిజినల్ రిజిస్టర్‌లో వున్న జాబితాతో సరిపోలుస్తున్నారు. దీంతో పాటు నకిలీ పట్టాల విషయంలో అణువణువూ తనిఖీ చేస్తున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అనర్హులకు ఇళ్లపట్టాల మంజూరుపై క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, నిదానమైనా నిక్కచ్చిగా విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. కాగా ఈ లేఅవుట్‌లో ఇంటి పట్టాలు కొనుగోలు చేసిన అమాయకుడు తాము మోసపోయామని లబోదిబో మంటున్నారు. కొందరేమో తాము డబ్బు ఇచ్చిన దళారుల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకుంటున్నారు.

కడుపు ఎండగడుతున్న క్వారీలు..

- ఆవేదన వ్యక్తం చేసిన స్థానికులు
- తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ
- హాజరైన వారికి రూ.500 తాయిలం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్,



డబ్బు పంచుతున్న క్వారీ ప్రతినిధులు

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): క్వారీల కారణంగా తమ కడుపులు ఎండుతున్నాయని, క్వారీల ఏర్పాటుకు ముందు ఒక విధంగా, తర్వాత మరో విధంగా యాజమాన్యాలు ప్రవర్తిస్తున్నాయని మదనపల్లె మండలం కోటవారుపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, కడప పొల్యూషన్ కంట్రోల్ ఇంజనీర్ కె.సుధ, తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో గురువారం కలర్ గ్రానైట్ క్వారీయింగ్‌కు అనుమతించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. క్వారీ ఏర్పాటుపై అభ్యంతరాలు తెలపాలని సబ్‌కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ 12 క్వారీలకు తాము అభ్యంతరం తెలపలేదని, కాని క్వారీ యజమానులు ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆరోపిరు. ఈ క్వారీల చుట్టుపక్కల పంట పొలాలు దుమ్ము, ధూళితో నిండిపోయి, బోర్లు ఎండిపోతున్నాయన్నారు. పర్యావరణవేత్తలుగా చెప్పుకున్న ఎన్‌జీఓలు క్వారీ అనుమతికి అభ్యంతరం లేదని చెప్పేశారు. దీనిపై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు చెప్పిన అభ్యంతరాలు, ఎన్‌జీఓల అభిప్రాయాలను రికార్డు చేసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు పంపుతామన్నారు. సమావేశం పూర్తి కాగానే ఈ క్వారీ చుట్టుపక్కల గ్రామాలైన బండకిందపల్లె, ఉడుంవారిపల్లె, కోటవారుపల్లె, కొత్తపల్లె గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు క్వారీ నిర్వాహకులు అన్నం పొట్లాలు ఇచ్చి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పంచిపెట్టారు. ఈ విషయంపై కోటవారుపల్లె సర్పంచ్ నారాయణస్వామి మాట్లాడుతూ ఈ నాలుగు పల్లెల్లో సమావేశం గురించి దండోరా వేశారని, ప్రజలందరూ స్వచ్ఛందంగానే వచ్చారన్నారు. అన్నం, డబ్బు తీసుకోవడానికి ప్రజలు అలవాటు పడిపోయారన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లె ఉపసర్పంచ్ ఎన్. నంద కుమార్, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

నాటు బాంబు పేలి ఆవుకు గాయాలు



నాటు బాంబు పేలడంతో గాయపడిన పాడి ఆవు

గుర్రంకొండ, మార్చి 6(ఆంధ్ర జ్యోతి): అడవి పందుల కోసం వేటగాళ్లు అమర్చిన నాటు బాంబును కొరకడంతో పాడి ఆవు తీవ్రంగా గాయపడింది. ఆవు యజమాని నాగరాజ తెలి పిన వివరాల మేరకు మండలంలోని సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లెకు చెందిన డి. నాగరాజ, రేవతి దంపతులు పాడి ఆవులను పోషిస్తుంటారు. గురువారం మేత కోసం పొలంలో వదిలిన సమయంలో ఒక ఆవు వేటగాళ్లు అమర్చిన నాటుబాంబు ను కొరికింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో నాగరాజ దంపతులు పరుగెత్తి చూడగా ఆవు నోటి భాగం తీవ్రంగా గాయపడి కనిపించింది. గాయపడిన పాడి ఆవు విలువ రూ.85 వేలు ఉంటుం దని నాగరాజు తెలిపారు. తమ పొలంలో నాటు బాంబు అమర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసు కుంటామని ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్పీఓ నాగరాజు

తంబళ్లపల్లె, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో నాగరాజు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని కుక్కరాజుపల్లె, కన్నెమడుగు, తంబళ్లపల్లె సచివాలయాలతో పాటు డంపింగ్‌యార్డులను తనిఖీ చేశారు. పలు చోట్ల డంపింగ్‌యార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు పట్టీ, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డితో కలసి సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి బృందావనాల్లో వర్మీ కంపోస్టు తయారుచేయాలన్నారు. గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగం కాకుండా సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో కృషి చేసి సంపద సృష్టించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధి లైట్లు తదితర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ దిలీప్‌కుమార్‌నాయక్, కార్యదర్శి రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పురాతన రాతి విగ్రహం లభ్యం



వెంకటేశ్వరస్వామి విగ్రహం

రైల్వేకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామం గిరిజన కాలనీకి సమీపంలో గురువారం కొన్ని వందల ఏళ్ల క్రితం నాటి వెంకటేశ్వరస్వామి విగ్రహం వెలుగుచూసింది. శెట్టిగుంట సమీపంలోనే ఉన్న శేషాచలం అడవుల్లో ఆది మానవుల సంచారం ఆనవాళ్లు, శిలాజాలు లభ్యమైన నేపథ్యంలోనే ఈ విగ్రహం కూడా బయట పడిందని గ్రామస్థులు నాగినేని వెంకటరమణ, చంద్ర తదితరులు తెలిపారు. మట్టిలో పూడుకుపోయి కనిపించిన ఈ విగ్రహాన్ని గ్రామస్తులు ఒక చోట నిలుచోబెట్టారు.

మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫారసు

రాజంపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజంపేట మున్సిపల్ పరిపాలన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సిపారసు చేశారు. వివరాలు ఇవీ.. 2022 ఆగస్టు 4న అప్పటి మున్సిపల్ పరిపాలనాధికారులపై వచ్చిన ఆరోపణలపై అప్పటి ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా రాజంపేట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, వారికి ప్రణాళికా అధికారులు సహకరించడం, పన్నుల విషయంలో అవినీతి ఆరోపణలు రావడం తదితర అంశాలపై వారు గుర్తించారు. ఈ అంశాలపై చాలా రోజులుగా విచారణ సాగుతోంది. అయితే ఈ నెల 6న అందుకు సంబంధించిన నాటి మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారిణి లక్ష్మీనారాయణమ్మ, మేనేజర్ శేషఫణి, సీనియర్ అసిస్టెంట్లు హరినాథ్, వెంకటమధుసూదన్, బిల్ కలెక్టర్ వెంకటరామకృష్ణ, జమాల్ అహ్మద్ తదితరులు అవినీతి ఆరోపణలకు పాల్పడినందున చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతులు అందాయి.

'మహిళా శిశు సంక్షేమం' అధికారిగా అనూరాధ

కలికిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారిగా పి.అనూరాధను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఐసీడీఎస్‌లో ఏసీడీపీఓగా పనిచేస్తున్న అనూరాధను డిప్యుటేషన్‌పై జిల్లాలో నియమిస్తూ ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎ.సూర్యకుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు

కుట్టు పనులతో మహిళలకు ఉపాధి

- 2015-16లో తొమ్మిది మండలాల్లో శిక్షణ
- మహిళా దినోత్సవం సందర్భంగా మళ్లీ ఇన్నాళ్లకు..




కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సంబేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం. మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించడంలో భాగంగా డ్వాక్రా సంఘాల ద్వారా స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 2015-16లో ఉమ్మడి కడప జిల్లాలోని 9 మండలాల్లో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి వారికి సబ్సిడీతో కుట్టు మెషీన్లను అందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా మళ్లీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది.

కుట్టు శిక్షణ ఇచ్చిన మండలాలు ఇవే..

2015-16లో సంబేపల్లె, నందలూరు, పెనగలూరు, కమలాపురం, జమ్మలమడుగు, అట్లూరు, ఖాజీపేట, వేంపల్లి, ప్రొద్దుటూరు మండలాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులకు ఒక్కో విడతలో 30 మందికి చొప్పున కుట్టు శిక్షణ ఇప్పించారు. అప్పట్లో సంబేపల్లె మండలంలో ఒక్కో బ్యాచ్‌కు రూ.17,550 చొప్పున ఖర్చు చేసి మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు వెలుగు ఏపీఎం సంజీవరాజు తెలిపారు.. ఇలా లో ఒక్కో మండలం నుంచి 90 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి సబ్సిడీతో కుట్టుమిషన్లను కూడా అందించినట్లు వెలుగు అధికారులు తెలిపారు. సంబేపల్లె మండలంలో అప్పట్లో కుట్టుమిషన్ల కోసం రూ.2,74, 659 ఖర్చు చేసినట్లు తెలియజేశారు.

కుటుంబ అవసరాలు తీరుతున్నాయి



2015-16లో మొదటి బ్యాచ్‌లో నేను సంబేపల్లె మండలంలో కుట్టుశిక్షణ పొందాను. సమయం దొరికినప్పుడు బట్టలు కుట్టడంతో ఇంటి అవసరాలకు చాలినంత ఆదాయం వస్తోంది. పండుగల సమయంలో మంచి గిరాకీ ఉంటుంది.

- జల్లా పరమేశ్వరి, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు అడ్డుకట్ట

- కొత్తచట్టం రూపొందిస్తున్న కూటమి ప్రభుత్వం
- ముసాయిదా విడుదల
- నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను క్రమబద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉపాధ్యాయుల బదిలీ చట్టం రూపకల్పనకు ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలు ఇష్టానుసారంగా జరిగాయి. సాధారణంగా కౌన్సెలింగ్ పద్ధతి ప్రకారం కాకుండా సిఫారసుల ఆధారంగా బదిలీలు సాగేవి. ఇటువంటి అక్రమాలకు తావులేకుండా ఏటా మే 31 నాటికి బదిలీలు చేపట్టి.. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయులు చేరేలా ముసాయిదా సిద్ధం చేసింది.

జిల్లాలో 1620 ప్రభుత్వ ప్రాథమిక, 127 ప్రాథమికోన్నత, 236 ఉన్నత పాఠశాలలు, 64 హైస్కూల్ ప్లస్, మొత్తం 2047 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్, వివిధ భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు 7821 మంది పనిచేస్తున్నారు. 2023 జూన్‌లో సాధారణ బదిలీల్లో సుమారు 3000 మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కాగా, బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయులు దీర్ఘకాలిక అనారోగ్యం, దివ్యాంగులుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తిష్ట వేస్తున్నారు. దీంతో అర్హులైన వారికి దగ్గర ఉండే ప్లేసులు దొరకవు. షెడ్యూల్ మేరకు బదిలీలు జరుగుతాయన్న నమ్మకం కూడా ఉండదు. విద్యా సంవత్సర మధ్యలోనో, ఆఖరిలోనో ఉన్నపలంగా బదిలీ చేస్తారు. కోర్టు కేసులవల్ల ఒక్కో జిల్లాలో ఒక్కోలా ప్రమోషన్లు సాగుతాయి. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర బదిలీల నియంత్రణ చట్టం-2025 అమలులోకి తెచ్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే బదిలీల డ్రాఫ్ట్ విడుదల చేసింది. ఈనెల 7వరకు ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ అభ్యంతరాలు స్వీకరించనుంది.

అన్ని డీఎస్సీల లెక్కలు తేలుస్తూ...

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సీనియారిటీ జాబితా ముఖ్యం. గతంలో చాలా మంది టీచర్లు తాత్కాలిక అవసరాల కోసం బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధిపొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని సైతం అడ్డగోలుగా నమోదు చేసుకున్నారు. కొందరు తాము అపాయింట్ అయిన డీఎస్సీ, నియామక తేదీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ వివరాలను టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీస్)లో సైతం తప్పుగా పొందుపరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టీచర్ల సీనియారిటీ జాబితాను పూర్తిగా క్రమబద్ధీకరిస్తోంది. నెల రోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ, ఐటీసెల్ అధికారులు దీనిపై కసరత్తు చేస్తున్నారు. డీఎస్సీలు 1982, 1984, 1989, 1994, 1998, 2000, 2002, 2014, 2018 టీచర్ల వివరాలు సేకరంచి సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు.

చాలా సమస్యలకు పరిష్కారం

ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం క్షేత్రస్థాయిలో అమల్లోకి వస్తే చాలా సమస్యలకు తెరపడే అవకాశం ఉంది. విద్యా సంవత్సర మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియ జరగనుం ది. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి భవిష్యత్‌లో సమస్య లేకుం డా శాశ్వతమైన సీనియారిటీ జాబితాను విద్యాశాఖాధికారులు సిద్ధం చేస్తున్నారు. దీంతో మెజార్టీ వర్గాలకు న్యాయం చేకూరే అవకాశాలున్నాయి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, బోగస్ దివ్యాంగ సర్టిఫికెట్లు పెట్టి లబ్ధిపొందాలనుకునే వారికి కూడా చెక్ పెట్టే అవకాశం ఉంది. రెండేళ్లు, మూడేళ్లకు బదిలీలు చేపట్టేవారు ఇకపై ఏటా నిర్వహిస్తామంటుండటం శుభపరిణామం. దీనిపై మెజార్టీ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకరిద్దరు మాత్రం లోపాలున్నాయని చెబుతున్నారు. తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని సవరించాలని కోరుతున్నారు.

అన్యాయం జరిగితే..



ఉపాధ్యాయుల బదిలీలలో అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లేందుకు అనుమతి కల్పించాలి. మూడు సంవత్సరాలలో పదవీ విరమణ పొందే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలి. 60శాతం దాటిన విభిన్న ప్రతిభావంతులదరికి ప్రిఫరెన్షియల్ కేటగిరీలో వెసులుబాటు కల్పించాలి. 117 జీఓ రద్దు వలన సర్‌ప్లస్ అయిన టీచర్లకు లాంగ్ స్టాండిగ్ పాయింట్ ఇవ్వాలి.

- రామాంజనేయులు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి



వెబ్‌కౌన్సెలింగ్ స్థానంలో ఎస్‌జీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. పాఠశాల కేటగిరీలో ఖాళీల బ్లాకింగ్ విధానం పై, సర్వీస్ పాయింట్లు, స్పెషల్ పాయింట్లు, ప్రిఫరెన్షియల్ కేటగిరీపై మార్పులు తీసుకురావాలి. పదోన్నతులకు అన్న కేటగిరీల ఖాళీలు చూపించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

పరిమిత ప్రయోజనమే...



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బదిలీల డ్రాఫ్ట చట్టం వల్ల ఉపాధ్యాయులలో భేదాభిప్రాయాలు ఉత్పన్నమవడం తప్ప పెద్దగా ఒరిగేదేమీ లేదు. దాదాపు ప్రస్తుతం ఉన్న 90శాతం నిబంధనల్లో పెద్దగా మార్పు లేదు. పెర్ఫార్మెన్స్ పాయింట్ల వంటి వివాదాస్పదమైన అంశాలను తొలగించాలి. జీఓ 117 రద్దు, మోడల్ పాఠశాలల ఏర్పాటు, హైస్కూల్ ప్లస్‌ల రద్దు వంటి అంశాల వల్ల రాబోయే సంవత్సరాల్లో విద్యా వ్యవస్థకు తీరని నష్టం జరుగుతుంది.

- కె.సురేష్‌బాబు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, ఎస్‌టీయూఏపీ

వీరభద్రుని ఆదాయం రూ.9.84 లక్షలు

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం శాశ్వత హుండీల్లోని డబ్బులను తహసీల్దారు రమాకుమారి, జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, దేవస్థానం ఛైర్మన్ పెరుగు వీరనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా వీరభద్రస్వామికి రూ.9,25,769, భద్రకాళి అమ్మవారికి రూ.58,717 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకలబాబు, గోసుల వీరారెడ్డి, వీరనారాయణ, కమిటీ సభ్యులు, పోలీసులు, గోవింద మాల సేవా మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

తలనీలాల వేలంపాట రూ.66 లక్షలు

చక్రాయపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాలు పోగుచేసుకునేందుకు నిర్వహించిన వేలంలో సికింద్రాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైయిటర్ పి.ఆదినారాయణ రూ.66లక్షలకు పాడి వేలాన్ని దక్కించుకున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం గండి కార్యాలయంలో వేలం నిర్వహించగా ఐదుగురు గుత్తేదారులలు పాల్గొన్నారన్నారు. గత ఏడాది రూ.65.11లక్షలు పలుకగా ఈ ఏడాది రూ.66లక్షలు పలికిందన్నారు. వేలం దక్కించుకున్న వారికి 01.04.2025 నుంచి 31.03.2026 వరకు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీదారులు శివయ్య, ఆలయ మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, బ్యాంకు, పోలీసులు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల పంపిణీని సద్వినియోగం చేసుకోండి

- వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ క్రిష్ణకిశోర్

కడప మారుతీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాళ్లు విరిగిన వారికి ఈనెల 7న శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కడప కలెక్టరేట్‌లో కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ క్రిష్ణకిశోర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక దరఖాస్తుల స్వీకరణ స్థలంలో చెన్నైకి చెందిన ఫ్రీడం ట్రస్టు ద్వారా యాక్స్ హెల్త్ కేర్ సహకారంతో కృత్రిమ కాళ్ల పంపిణీకి అవసరమైన కొలతలను వికలాంగుల నుంచి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఒక్కో కృత్రిమ కాలు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని.. అవసరమైన వారికి ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించినట్లు వైవీయూ ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. గురువారం వైవీ యూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.విజయభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలను పొందేందుకు విద్యార్థులు విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. దివీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్, శ్రీచైతన్య స్కూల్స్ ప్రతినిధులు రాత పరీక్ష ఇంటర్వ్యూ, డెమో ద్వారా వారి సంస్థలకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు. ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు రెడ్డయ్య, గణేష్‌నాయక్, డాక్టర్ కె.లలిత విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరేళ్లు సర్వీస్ ఉన్న వారినే నియమించాలి

- డీఈఓకు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వినతి

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల సర్వీస్ ఉన్నవారిని చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులుగా నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డీఈఓ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో డిపార్ట్‌మెంట్, చీఫ్ సూపరింటెండెంట్లుగా అతి తక్కువ సర్వీసు గల పాఠశాల సహాయకులను నియమిస్తున్నారని, కనీసం ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన వారిని నియమించాలని కోరుతున్నామన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

వేంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఇంటెల్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏడుమంది ఈసీఈ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగుళూరుకు చెందిన ఇంటెల్ కంపెనీ రూ.45 వేలు నెల వేతనానికి ఏడు మంది విద్యార్థులను ఎంపిక చేసుకుందని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ అభినందించారు. ఏఓ రవికుమార్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్, సుందర్ పాల్గొన్నారు.

కొనసాగిన విద్యార్థుల దీక్ష



కళాశాల ఆవరణంలో దీక్ష చేపట్టిన విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. దీంతో గురువారం 32వ రోజుకు చేరింది. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో విద్యార్థులు శాంతియుతంగా సమ్మెను కొనసాగించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరేవరకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తమ పోరాటాన్ని ఆపేది లేదని విద్యార్థులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపకారవేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు.

భార్యపై కత్తితో దాడి... తీవ్ర గాయాలు

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో బీసీ కాలనీలో ఎర్రిబోయిన బాస్కర్ తన భార్య కళావతి(40)పై గురువారం మధ్యాహ్నం కత్తితో దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల వివరాల మేరకు.. భాస్కర్ పక్షపాతంతో బాధపడుతున్నాడు. గతకొంత కాలంగా కళావతిపై అనుమానం పెంచుకున్నాడు.

గురువారం కూలిపనికి వెళ్లివచ్చిన కళావతిని దూషించి కత్తితో దాడిచేసి గాయపరిచాడని, ఆమె కేకలు వేయడంతో భాస్కర్ పారిపోయాడన్నారు. ఈ దాడిలో కళావతి తలకు, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలు కాగా ఆమెను ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు. ట్రైనింగ్ డీఎస్పీ భవానీ సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన పాలూరు లక్ష్మి (35) కర్నూలులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 2వ తేదీన తన ఆడబిడ్డ దేవిలక్ష్మితో గొడవపడి బాధపెట్టిందని మనస్థాపంతో పురుగుల మందు తాగిందని, అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడే లక్ష్మి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు పేర్కొన్నారు. దేవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుశాఖకు జాగిలాల సేవలు అమోఘం

- జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు



పోలీసు జాగిలాలను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖకు జాగిలాలు వాఘా ఝూన్సీ 11 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించాయని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు కొనియాడారు. గురువారం సాయంత్రం స్థానిక పెన్నార్ పోలీసు హాలులో వాఘా, ఝూన్సీ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరులుగా పేరుగాంచిన లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన జాగిలాలు వాఘా, ఝూన్సీలను అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ (ఎఆర్) రమణయ్య శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్లు పీరయ్య, బీవీ క్రిష్ణయ్యలను అదనపు ఎస్పీ అభినందించారు. పలు సీఎం బందోబస్తు విధులు, వీవీఐపీ, వీఐపీల విధులు, క్రిష్ణా, గోదావరి పుష్కరాల్లో, తిరుమల బ్రహ్మోత్సవాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి పలువురి ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం వాఘా, ఝూన్సీలను మేళతాళాలతో బాణసంచా కాల్చుతూ వాటి విడిది గృహాల వద్దకు చేర్చి ఘనంగా వీడ్కోలు పలికారు. ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు శివరాముడు, వీరేశ్, శ్రీశైల రెడ్డి, టైటస్, ఆర్‌ఎస్‌ఐలు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ టీం, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అప్పులబాధతో రైతు ఆత్మహత్య



మోషే (ఫైల్‌ఫొటో)

మైలవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిరపపంటలో ఆశించిన దిగుబడి రాకపోవడం... పండిన పంటను కొనుగోలు చేసేవారు లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం మైలవరం మండలంలో చోటు చేసు కుంది. పోలీసులు, బంధువుల వివరాల మేరకు... మండ లంలోని దుగ్గనపల్లెకు చెందిన చీపాటి మోషే (52) అనే రైతు తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 1.40 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరపపంట సాగు చేశాడు. ఎకరాకు రూ.2 లక్షల మేర దాదాపు 12 లక్షల వరకు పంటసాగుకు అప్పులు చేసి పెట్టు బడి పెట్టాడు. మిరప కోత అనంతరం రెండు రోజుల క్రితం గుంటూరు మార్కెట్‌కు మిరపకాయలు తీసుకెళ్లాడు. అయితే మిరప కాయలపై దుమ్ము దూళి ఉండటం.. మిరప నాణ్యత సరిగా లేకపోవడంతో ఎవ్వరూ కొనుగోలు చేయ లేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక.. తీవ్ర మనస్థాపానికి గురై గురువారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి మృతి చెందాడు. కుటుం బసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహా న్ని పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి కుమారుడు, ఇద్ద రు కుమార్తెలు ఉన్నారు. కాగా, ఈ ఏడాది దాల్మియా పరి శ్రమ నుంచి వచ్చే దుమ్ము దూళితో మిరప పంట దిగుబ డి సరిగా రాక.. ధర లేకపోవడంతో మనస్థాపానికి గురై మృతి చెందినట్లు మోషే తండ్రి స్వామిదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



ముద్దనూరు మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె సమీపంలో కడప- తాడిపత్రి హైవే పక్కన గురువారం బుల్లి అశోక్(32) అనుమానాస్పద స్తితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం భద్రంపల్లెకు చెందిన బుల్లి అశోక్‌కు 10 సంవత్సరాల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన అమ్మాయితో వివాహమైంది. 3 సంవత్సరాల క్రితం భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తను విడిచి వెళ్లింది. అప్పటి నుంచి అశోక్ మద్యంకు బానిసయ్యాడు. 15 రోజుల క్రితం భార్య వద్దకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లి తిరిగి వచ్చాడు. బుధవారం మళ్లీ భార్య వద్దకు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే కొత్తపల్లె సమీపంలోని రోడ్డు పక్కన మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

కువైట్‌లో గోపవరం వాసి మృతి

గోపవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడి మూడునెలలు మృత్యువుతో పోరాడి.. చివరకు మృతి చెందాడు. గోపవరం మండలం అడుసువారిపల్లెకు చెందిన వంతెరపల్లె రమణారెడ్డి (53) కువైట్‌లో సెంట్రింగ్ పనులు చేస్తుండగా స్టీలు రాడ్లు మీద పడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ రమణారెడ్డి చికిత్స పొందుతూ మార్చి 2న మృతి చెందాడు. కాగా గురువారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఇద్దరి మృతి

- ఏడుగురికి గాయాలు





మృతి చెందిన ముత్తరాసు లక్ష్మమ్మ, అంజనేయులు (ఫైల్)

ఎర్రగుంట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గనిలో కూలి పని కోసం ట్రాక్టర్‌లో కూలీలు వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా... మరో ఏడుగురు గాయపడ్డారు. వివరాల్లోకెళితే... గురువారం ఉదయం చిలమకూరులో గనిలో పని కోసం ట్రాక్టర్‌లో ఎన్‌హెచ్ రోడ్డు నుంచి బయలుదేరారు. అదే సమయంలో మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్‌జేఎల్ 7081 నెంబరుగల లారీ వెనుకవైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ట్రాక్టర్ పడిపోవడంతో ట్రాక్టర్‌లో ఉన్న ముత్తరాసు లక్ష్మమ్మ (56) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ వెంకట ఆంజనేయులు (52) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే ట్రాక్టర్‌లో ఉన్న ఓబయ్య, హరినాథ్, చిన్న ఓబన్న, గుర్రప్ప, పొన్న వెంకటసుబ్బయ్య, బాల స్వామి, మల్లేల రోశయ్యలు గాయపడ్డారు. అర్బన్ సీఐ నరేష్ బాబు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

వన్యప్రాణిని వేటాడిన ఇరువురిపై కేసు నమోదు

- నాటుతుపాకీ, జింక మాంసం స్వాధీనం

వేంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఫారెస్ట్ బీట్ కప్పలమడుగు ప్రాంతంలో వన్యప్రాణిని వేటాడిన వ్యవహారంలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. కుమ్మరాంపల్లెకు చెందిన శ్రీరాములు, నటరాజులు రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో నాటుతుపాకీతో వన్యప్రాణులను వేటాడారు. సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించగా శ్రీరాములు పట్టుబడ్డాడు, నాటుతుపాకీతో పాటు జింక మాంసం స్వాధీనం చేసుకున్నారు. నటరాజ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

పులివెందులటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఉలిమెల పొలాల్లో బుధవారం రాత్రి కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు గురువారం ఫారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతి చెందిన జింకను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల పశువైద్యశాలకు తరలించారు. డాక్టర్ రవికిరణ్‌రెడ్డి జింకకు పోస్టుమార్టం చేసి ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

తమిళనాడును ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేసే ప్రక్రియను 30 ఏళ్లపాటు వాయిదా వేయాలి లేదా 1971 జనాభా ప్రాతిపదికనే చేయాలంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో జరిగిన ఆ రాష్ట్ర అఖిలపక్ష సమావేశం తీర్మానం చేయడం ఆహ్వానించదగినదని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భిన్నమైన సిద్ధాంతాలు, విధానాలు కలిగినప్పటికీ తమ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తమళనాడులో ఎన్డీఏను బలపరిచే పార్టీలు సైతం సదరు తీర్మానాన్ని బలపర్చడం గమనార్హం అని పేర్కొన్నారు. ఇదే వైఖరిని ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అనుసరించాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు. లేదంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుందనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గాల పునర్విభజనను జనాభా ప్రాతిపదికన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రయోజనాలనే తప్ప రాజకీయాలను చూడాల్సిన అవసరం లేదని సూచించారు. ఇందుకు తమిళనాడు రాష్ట్రాన్నే మనం ఆదర్శంగా తీసుకోవాలని, ఈ అంశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి స్పందించాలని ఆయన కోరారు.



వాల్మీకిపురంలో అసంపూర్తిగా అదనపు గదుల నిర్మాణం

నాడూ నేడూ అరకొరే...!

- అర్ధంతరంగా నిలిచిన పనులు
- కలకడలో నేటికీ పునాదులకే పరిమితం
- మొండి గోడలతో జడ్పీ బాలికోన్నత పాఠశాల
- తుప్పుపడుతున్నాయి

వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా నాడు ప్రారంభించిన పనులు నేటికీ అరకొరగానే ఉన్నాయి. 'నాడు - నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తాం.. కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామంటూ' వైసీపీ పాలకులు చేసిన ప్రకటనలు ప్రచారటోపమే. గొప్పగా ప్రకటనలు గుప్పించి పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, వంటగదులు, గోడలకు పెయింటింగ్, మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు, డోర్లు తదితర పనులు చేసేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. నాడు చేపట్టిన పనుల్లో బిల్లులు కాజేయడంతో అర్ధంతరంగా పనులు నిలిచి పోయాయి. మొదటి పర్యాయం బిల్లులు తిన్నా కనీసం రెండో పర్యాయమైనా పనులు పూర్తి చేశారా అంటే అదీలేదు. నేటికీ అరకొరగానే మిగిలాయి. పనులు అరకొర చేసి బిల్లులు కాజేసిన వైసీపీ పాపం విద్యార్థులకు శాపంలా పరిణమించింది. అస్మదీయులకు ఆదాయం చేకూర్చేందుకే ఈ పనులు రూపొందించారని చెప్పవచ్చు. గురువారం ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ నిర్వహించిన విజిట్ వివరాల్లోకెళితే...

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

వైసీపీ పాలనలో ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లకు జీవనోపాధిలా మారిన నాడు-నేడు పనులు నేడు అరకొర పనులతో వెక్కిరిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులు చాలా పనులు సగంలోనే నిలిచిపోయాయి. ఫలితంగా కోట్లాది రూపాయలు ప్రజాధనం నిరుపయోగమైంది. నీరుగట్టువారిపల్లె లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌కు నిధులు మంజూరైనా 80శాతం ఖర్చుపెట్టి మిగిలిన పనులు వదిలేశారు. నేటికీ విద్యార్థులు చెట్టుకింద వరండాల్లోనే చదువుతున్నారు. ములకలచెరువు మండలం సోంపల్లెలో ప్రభుత్వపాఠశాల పైకప్పు పెచ్చులూడి ఉరుస్తోంది. నాడు-నేడు పనుల్లో నిర్మించిన మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లకు డోర్లు బిగించకపోవడంతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. రామసముద్రం మండలంలో నాడు-నేడు రెండో విడత పనులు 75శాతమే పూర్తయ్యాయి. కురబలకోట మండలంలో రూ.12.29కోట్లకు రూ.6.17 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, గోడలకు పెయింటింగ్, వంటగదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా వున్నాయి. పీటీఎం మండలంలో రూ.13.66 కోట్ల నిధులు మంజూరు కాగా అన్ని పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. బి.కొత్తకోట మండలంలో రెండు విడతల్లో రూ.9.61 కోట్ల నిధులకు 70శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. ఈ పనులు ఎందుకూ పనికిరానివిగా మారి దర్శనమిస్తున్నాయి. నిమ్మనపల్లె, తంబళ్లపల్లె మండలాల్లో కూడా నాడు-నేడు పనులు అసంపూర్తిగానే వున్నాయి. పెద్దమండ్యం మండలంలో రూ.10.26 కోట్లకు 70శాతం పనులే జరిగాయి. మొత్తం మీద మదనపల్లె డివిజన్‌లో రూ.100కోట్లతో చేపట్టిన నాడు-నేడు పనులు కొరగాని కొయ్యగా మిగిలిపోయాయి.

వాల్మీకిపురంలో పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.56.12 లక్షలతోనూ, స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో రూ.13.56 లక్షలతో అదనపు తరగతి గదులు, తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలు నిర్మాణం పూర్తి అయినట్లు కనిపిస్తున్నా సౌకర్యాల కల్పన పూర్తికాక అదే భవనాల్లో తరగతులు నిర్వహిస్తుండడం గమనార్హం. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయి మొండి గోడలను తలపిస్తున్నాయి. 'నేడు-నేడు' అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాక డొల్లా తయారయ్యాయి. నిలిచిపోయిన పనుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంఈఓ వెంకటరత్నం తెలిపారు. కలికిరి మండలంలో 2వ విడత 'నాడు-నేడు' ద్వారా 29 పాఠశాలలను ఎంపిక చేసి రూ.8 కోట్లతో పనులు ప్రారంభించారు. ఏ పాఠశాలలోనూ 50 శాతం మించి పనులు పూర్తి కాలేదు. గుర్రంకొండ జడ్పీ తెలుగు ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టి నిధులున్న కాడికి పనులు చేశారు. నిర్మాణాలు పూర్తి కావాలంటే నిధులు రావాల్సిందేనని ఎంఈఓ తెలిపారు. కంద్రిగ పాఠశాల మొదటి విడత 'నాడు-నేడు' పనులకు ఎంపికైనా నేటికీ పనులు పూర్తి కాలేదు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి పాత ప్రహరీని తొలగించినా కొత్త ప్రహరీ నిర్మాణం చేపట్టలేదు. కలకడ మండలం ఎర్రయ్యగారి పల్లె జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనం పనులు నేటికీ పునాదులకే పరిమితమయ్యాయి. 'నాడు-నేడు' రెండో విడతలో పాఠశాల నిర్మాణానికి రూ.84 లక్షలు మంజూరు కాగా అప్పట్లో ప్రారంభించినా 2023 డిసెంబరులో పనులు నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నపళంగా సిమెంటు సరఫరాను నిలిపివేయడంతో సమస్య ఏర్పడినట్లు తెలిసింది. విద్యార్థులకు తగిన సౌకర్యాలు లేక వర్షం, వేసవి కాలాల్లో ఇబ్బందులు పడుతున్నారు.


బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె జడ్పీహైస్కూల్లో అసంపూర్తిగా పాఠశాల గదుల నిర్మాణాలు


తలుపులు లేని పాఠశాల మరుగుదొడ్లు (ములకలచెరువు మండలం సోంపల్లె)


పునాదికే పరిమితమైన ఎర్రయ్యగారిపల్లె జడ్పీ హైస్కూల్ భవనం (కలకడ)

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎల్లంపల్లె ప్రశాంత్


టీజీ వెంకటేష్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న ఎల్లంపల్లె ప్రశాంత్

మదనపల్లె అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా మదనపల్లె వాసి ఎల్లంపల్లె ప్రశాంత్‌ను నియమించారు. గురువారం ఆయన మాజీ ఎంపీ, ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టీజీ వెంకటేష్ ద్వారా నియామక పత్రం అందుకున్నారు. నూతన ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ తాను బీజేపీలో రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నానని, జిల్లాలో ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి, ఆర్యవైశ్యులు అభ్యున్నతికి కృషి చేసిన ఫలితంగా ఈ పదవి ఇచ్చారన్నారు. నాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇంతటి బాధ్యతలను తనకు అప్పగించిన ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టీజీ వెంకటేష్‌కు ఏపీ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్నరామ సత్య నారాయణ, పెద్దలు ఇల్లూరు లక్ష్మయ్య, ముప్పల నరసింహులు, పలస వేణుగోపాల్, మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

మదనపల్లె అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి పన్నుల రూపంలో కోట్ల రూపాయలు ఆర్జించి పెడుతున్న ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం సంతగేట్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రయాణీకులు, రైతులు పండించే పంటను మార్కెట్లకు చేరుస్తూ ప్రభుత్వానికి ఆదాయం తెస్తున్నారన్నారు. అలాంటి ఆటో డ్రైవర్లకు భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం జీఓ 21.31 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నేతలు ముబారక్, రెడ్డెప్ప, తిరుమల, ఆటో నేతలు నాగేశ్వరరావు, వెంకటేస్, రమణ, మస్తాన్, శివ,శంకర, గంగులప్ప పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి


సంకరజాతి దూడల ప్రదర్శనలో అధికారులు

వాల్మీకిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నుంచి పశుసంపదను కాపాడుకోవాలని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై సూచించారు. గురువారం నగిరిమడుగు గ్రామంలో పశుసంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సంకరజాతి పెయ్య దూడల ప్రదర్శన నిర్వ హించారు. శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. జాతీయ పశువ్యాధి నివారణ పథకం ద్వారా 4 నుంచి 8మాసాల పెయ్య దూడలకు బుసెల్లోసిక్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుసంపద పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నివారణ మందులు, పశు బీమా పథకం తదితర అంశాలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. సహాయ సంచాలకులు డాక్టర్ నీరజ, డాక్టర్ చరిత, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, నాయకులు పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

ఎంజేఆర్‌లో డిజిటల్ మార్కెటింగ్‌పై వర్క్‌షాప్


వర్క్ షాపులో మాట్లాడుతున్న ఎంజేఆర్ యాజమాన్యం

పీలేరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఎంజేఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిజిటల్ మార్కెటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి జరిగిన వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. కళాశాల చైర్మన్ ఎం.పి.అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలోని ఎంబీఏ ప్రథమ, ద్వితీయ ఏడాది విద్యార్థుల కోసం తిరుపతికి చెందిన అకాడెమో అప్‌స్కిల్ సంస్థ సహకారంలో వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. వర్క్‌షాప్‌లో విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్‌లో నూతన ట్రెండ్స్, డిజిటల్ మార్కెటింగ్‌లో వినియోగించే ఏఐ టూల్స్, డిజిటల్ ప్రమోషన్‌లో వివిధ బ్రాండ్ల కేస్ స్టడీస్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, లోగో జెనరేషన్ వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గల్లా విష్ణు, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ బదిలీకి సిఫారసు

- సాయంకాలానికి షోకాజ్ నోటీసు జారీ చేయాలి
- ఊరూరికి ఒకరు సీఎం కావాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ వ్యంగ్య వ్యాఖ్యలు


కలికిరి గురుకుల విద్యార్థినులతో మాట్లాడుతున్న చైర్మన్

కలికిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ వసతి గృహం వార్డెన్ రవీంద్రను వెంటనే బదిలీ చేయాలని, అంతకు ముందు ఆయన విధుల వైఫల్యాలపై షోకాజు నోటీసు జారీ చేయాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. నిజానికి గురువారం ఆయన పర్యటనలో ఈ హాస్టల్ సందర్శన లేదు. బుధవారం రాత్రికి పర్యటన ముగించుకుని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బస చేశారు. గెస్‌హౌస్‌కు ఆనుకుని హాస్టల్ ఉండడం, చైర్మన్ బసచేసినట్లు తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయమే గెస్ట్ హౌస్ వద్దకు చేరుకుని వార్డెన్‌పై ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయన ఆకస్మిక సందర్శన చేపట్టారు. ఇద్దరు టీచర్లు వుండాల్సి వుండగా ఒక్కరే వున్నారని విద్యార్థులు ఫిర్యాదులు చేశారు. వారానికి రెండు పర్యాయాలే చికెన్ వండుతున్నట్లు చెప్పారు. అరటి పండు సక్రమంగా ఇవ్వడం లేదని, విద్యార్థులతో పాత్రలు కడిగిస్తున్నారన్నారు. వార్డెన్, వాచ్‌మెన్, వంట మనిషి వ్యవహారాలపై విద్యార్థులు ఫిర్యాదులు గుప్పించారు. అక్కడే వున్న వార్డెన్ రవీంద్రను నిలదీసినా సరైన వివరణ ఇవ్వలేక నీళ్లు నమిలారు. గోడపై తన నంబరు రాయించి ఇతర సమస్యలుంటే వాట్సాప్ ద్వారా తెలపాలని విద్యార్థులకు చైర్మెన్ సూచించారు. ఆ వెంటనే సంక్షేమ శాఖ డీడీకి ఫోను చేసి వార్డెన్ వ్యవహారాలను ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే వార్డెన్‌ను బదిలీ చేయాలని, ఆలోగా షోకాజ్ నోటీసు జారీ చేయాలన్నారు. అనంతరం బీసీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు ఫోర్టిఫైడ్ రైస్ గురించి ఆయన వివరించారు. పాఠశాల భవనాలు చాలా బాగున్నాయని, గతంలో ఇక్కడి సీఎం 'పడా' కార్యాలయానికి కట్టించారని తెలిసిందన్నారు. దీంతో ఊరూరికీ ఒకరు సీఎం కావాలని, వాళ్ళు వెళ్లిపోగానే ఇలాంటి భవనాలు మిగిలిపోతాయని వ్యంగ్యంగా అన్నారు. టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఒక వాచ్ బహూకరించాలని చెపుతూ ప్రిన్సిపాల్ చేతికి రూ.2 వేలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయినులు, ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున రెడ్డి తదితరులు చైర్మన్‌ను అనుసరించారు.

పీలేరు మండలంలో...

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉచిత ఆహార పంపిణీలో అవినీతి నిర్మూలనే ధ్యేయమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను పరిశీలించారు. పట్టణంలోని యల్లమంద క్రాస్ అంగన్‌వాడీ కేంద్రంలో విలేఖరులతో మాట్లాడుతూ ఐసీడీఎస్, సివిల్ సప్లైస్, సంక్షేమ హాస్టళ్లు, మధ్యాహ్న భోజనం పథకం, పీఎం మాతృత్వ వందన యోజన పథకంపై ఫుడ్ కమిషన్ విస్తృతంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఈఓ సుబ్రహ్మణ్యం, డీఎస్‌ఓ రఘురామన్, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులు సురేశ్ బాబు, జయప్రకాశ్, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, సీడీపీఓ రాజమ్మ, తహసీల్దారు భీమేశ్వర రావు, సీఎస్ డీటీ విజయ కుమార్ రెడ్డి, ఎంఈఓలు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్‌సేఫ్టీ పై మహిళలకు అవగాహన

బి.కొత్తకోట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పలువురు మహిళలు, విద్యార్థినులతో మమేకమై మహిళల రక్షణ- చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ జీవన్‌గంగనాథ్ బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పలువురు మహిళలు, కస్తూర్బా విద్యాలయ బాలికలకు టోల్‌ఫ్రీ నంబర్లు 122, 181, 10920, 1291పై వివరంగా తెలిపి అవసరమైనపుడు ఎలా వినియోగించుకోవాలని ఆయన వివరించారు.

వడ్డెర్లకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలి

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాదీపం వడ్డెర్లకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. అన్నమయ్య సర్కిల్ వద్ద వడ్డెర సంఘం నేతలు జె.రెడ్డెప్ప, డి.శ్రీనివాసులు, ఎం.రెడ్డిశేఖర్, ఇ.రెడ్డిశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవర్ల మురళికి రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గుణభూషణ్, రెడ్డెప్ప, రామ్మోహన్, వెంకటనారాయణ, నాగరాజు, సిద్దప్ప, ఆంజినేయులు పాల్గొన్నారు.

కురవంక సర్పంచ్‌కు మాతృవియోగం

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి తల్లి చెన్నెమ్మ గురువారం మృతి చెందారు. చిప్పిలి గ్రామంలో నివసిస్తున్న చెన్నెమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె మల్లయ్యకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి, వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, విద్యాసంస్థల అధినేతలు రాటకొండ గురుప్రసాద్, ఎన్.సేతు, కామకోటి ప్రసాదరావు, విదురశేఖర్‌రెడ్డి, బాగేపల్లె వేమారెడ్డి, బోయపాటి మురళి నాయుడు, కంచర్ల శ్రీనివాసులు నాయుడు, దొరస్వామినాయుడు, ఎమ్మార్పీఎస్ వాసు, తదితరులు చలపతిని పరామర్శించారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయండి


సంపతికోట సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి

పెద్ద తిప్పసముద్రం మార్చి6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సచివాలయ సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని మదనపల్లె డివిజనల్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) అమర్‌నాథ్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ మునిప్రతాప్‌తో కలిసి బూర్లపల్లె, సంపతికోట, మల్లెల, టి.సదుం, తుమ్మరకుంట సచివాలయాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల పరిధిలోని సచివాలయ సిబ్బంది సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు

రేపటి నుంచి అనంతపురమ్మ జాతర



వాల్మీకిపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మంచూరు గ్రామం శాకంవారిపల్లె సమీపంలో వెలసిన అనంతపురమ్మ దేవత జాతర మహోత్సవాలు 8వతేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కొలిచే అమ్మవారి జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారి అభిషేకం, అర్చన, తోమాల సేవలతో తొలి పూజలు ప్రారంభం కానున్నాయి. 8న శనివారం సాయంత్రం నుంచి అమ్మవారికి అలంకరణలు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రికి అమ్మవారికి దీలు, బోణాలు సమర్పణ, చాందినీ బండ్లు, చెక్కభజనలు, కోలాటలు, భజనలు జరగనున్నాయి. ఆదివారం అమ్మవారికి మొక్కులు చెల్లింపులు, సాయంత్రం ఉట్ల తిరునాళ్లు నిర్వహించనున్నారు.

గృహ నిర్మాణాల్లో అదనపు చెల్లింపులు


గృహనిర్మాణాలు పరిశీలిస్తున్న డీఈ వెంకటరెడ్డి

పెద్దమండ్యం, మార్చి 6(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ గృహ నిర్మాణాల్లో ఎస్టీ ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనపు చెల్లింపులు జరుగుతాయని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి పేర్కొన్నారు. పెద్దమండ్యం, పాపేపల్లి గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలు పరిశీలించిన డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా 2019 నుంచి 2024 వరకు మంజూరై వివిధ దశల్లో వున్న ఎస్టీ ఎస్సీ బీసీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. అర్హులందరికీ సిమెంట్, కమ్మీ అందుబాటులో వున్నాయన్నారు. వివరాలకు హౌసింగ్ కార్యాలయం, సచివాలయ ఇంజనీరు అసిస్టెం ట్లను సంప్రదించాలన్నారు. హౌసింగ్ ఏఈ అక్రం బాష పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ములకలచెరువు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరసింహుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు అతి వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మద్యం తాగి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన పలువురిని తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు.

రేపు ధర్మపథంలో మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో శనైశ్వరుడికి మహాతైలాభిషేకం నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏకవార రుద్రాభిషేకం, శని మృత్యుంజయ హోమం, విశేష పూజలు జరుగుతాయని తెలిపారు.

నేడు జిల్లెళ్ల మందలో నవోదయం 2.0

పీలేరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం జిల్లెళ్లమందలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నవోదయం నిర్వహించనున్నట్లు పీలేరు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని నాటు సారా రహితంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవోదయం 2.0ను అమలు చేస్తోందని సీఐ తెలిపారు.

ఆవిర్భావ సభకు తరలిరండి

మదనపల్లె, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో 14వతేదీన జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు తరలిరావాలని రాయలసీమ కో కన్వీనర్ రాందాస్‌చౌదరి, రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇన్‌చార్జి అతికారి క్రిష్ణ పిలుపు నిచ్చారు. శేషసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన జనసేన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవాలకు నేతలు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్షులు, మండల కమాటీలు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

రామసముద్రం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పెద్ద కురప్పల్లె పంచాయతీలో పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, మందు పిచికారీ చేశారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం అమలులో భాగంగా పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ డీడీ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రోహిణి, డాక్టర్ దివ్య, అజయ్, ఏహెచ్‌ఏ నాగభూషణ్, వెటర్నరి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శిస్తే సహించేది లేదు

తంబళ్లపల్లె, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి లేదని జనసేన మండల నేత ఎద్దుల నరసింహులు అన్నారు. మాజీ సీఎం జగన్ పవన్ కల్యాణ్‌ను విమర్శించడాన్ని జనసేన, టీడీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. జనసేన, టీడీపీ నేతలు మురళి, మనోహర్, తెలుగు యువత నరసింహులు, కశెట్టి వెంకట్రమణ, తదితరులు ఉన్నారు.

12న టమోటా, గొర్రెల సంతలకు వేలం

కురబలకోట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంగళ్లలో టమోటా మార్కెట్, గొర్రెలు, వారపు సంతలకు 12న వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వేలం పాటల్లో పాల్గొనదలచిన వారు టమోటా మార్కెట్, గొర్రెల సంతకు రూ.5లక్షలు డిపాజిట్, వారపు సంతలకు రూ.50వేలు చెల్లించి వేలంపాటల్లో పాల్గొనాలని కోరారు. ఈ అవకాశాన్ని వేలం పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.